

రైతు గుండెల్లో 'తుఫాన్'

- కళ్లాల్లో 40 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం
- అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన



కుప్ప వేసుకుంటున్న రైతులు

రాజమహేంద్రవరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రైతుల్లో తుఫాన్ ఆందోళన నెలకొంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో రెండు మూడ్రోజులు ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు వాతావరణ కేంద్ర హెచ్చరికలతో రైతులు హడలిపోతున్నారు. ప్రస్తుతం పొలాలు, జాతీయ రహదార్లు, రోడ్లు, ఇతర ప్రాంతాల్లోని కళ్లాల్లో 40 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం రాశులు ఉన్నాయి. వాటిని వెంటనే తరలించకపోతే వర్షం వల్ల ఇబ్బంది తప్పదని రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో మొత్తం 72 వేల 246 హెక్టార్లలో వరి పంట సాగుచేశారు. అందులో ఇప్పటివరకు 46వేల 007 హెక్టార్లలో వరికోతలు పూర్తయ్యాయి. ఇవి 65 శాతం. వీటి ద్వారా 3 లక్షల 11వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చింది. అందులో పౌరసరఫరాల శాఖ ద్వారా లక్షా 49వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు. రైతులు సుమారు 60 వేల టన్నుల ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాల్లో దాచిపెట్టుకున్నారు. కళ్లాల్లో ఇంకా 40 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉంది. ఓపెన్ మార్కెట్‌లో సుమారు 25 వేల టన్నుల ధాన్యం అమ్మారు.

వర్షం వస్తే కోతలు ఆపాలి

తుఫాన్ ప్రభావం వల్ల వర్షాలు వస్తే ప్రస్తుతం వరికోతలు ఆపేయాలని, సమస్య లేకపోతే కోతలు కోసుకోవచ్చని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు తెలిపారు. వాతావరణ మార్పుల వల్ల రైతులు వెంటనే అప్రమత్తమై ధాన్యాన్ని వెంటనే కొనుగోలు కేంద్రాలకు తరలించాలన్నారు. ఎక్కడైనా యంత్రాలతో కోసిన పచ్చి ధాన్యం ఉంటే బాయిల్డ్ మిల్లులకు తరలించాలని కోరారు.

నిలదీసి.. నిగ్గదీసి..



బియ్యం నమూనాలను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం పవన్, మంత్రి నాదెండ్ల, ఎమ్మెల్యే కొండబాబు

- కాకినాడ పోర్టులో రేషన్ మాఫియాపై పవన్ శివాలు
- యథేచ్ఛగా బియ్యం తరలిపోతుంటే అంతా ఏం చేస్తున్నారంటూ నిప్పులు
- డీఎస్‌వో, కలెక్టర్, ఎస్పీ, డీఎస్పీ, పోర్టు అధికారులపై తీవ్ర ఆగ్రహం
- తానొచ్చినప్పుడల్లా జిల్లా ఎస్పీ సెలవుపై వెళ్లడమేంటని మండిపాటు
- ప్రతిసారి ఎమ్మెల్యేలు, మంత్రులువస్తేగానీ బియ్యం అక్రమ రవాణా ఆగదా అని నిప్పులు
- పవన్ ప్రశ్నలు, నిలదీతలతో హడలిపోయిన అధికారులు.. బియ్యం మాఫియాకు షాక్
- అటు సముద్రం అల్లకల్లోలంగా ఉన్నా సాహసించి తొమ్మిది నాటికల్ మైళ్ల ప్రయాణం
- రెండు నెలలుగా తనను తనిఖీలకు రాకుండా అడ్డుకుంటున్నారని సంచలన వ్యాఖ్యలు
- పశ్చిమ ఆఫ్రికాకు వెళ్లే నౌకను సీజ్ చేయాలని ఆదేశాలు : ఎస్పీకి నోటీసులు



మీడియాతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం పవన్. పక్కన మంత్రి నాదెండ్ల, ఎమ్మెల్యే కొండబాబు, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్

(కాకినాడ/కలెక్టరేట్ - ఆంధ్రజ్యోతి)

కాకినాడ నుంచి యథేచ్ఛగా రేషన్ బియ్యం విదేశాలకు తరలిపోతున్న వైనంపై డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ నిప్పులు చెరిగారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా అధికారులు పద్ధతి మార్చుకోకుండా మాఫియాకు సహకరిస్తున్నారంటూ ధ్వజమెత్తారు. రేషన్ బియ్యం విదేశాలకు తరలిపోయేలా అధికారులే సహకరిస్తున్నారంటూ శివాలెత్తారు. డీఎస్‌వో, కలెక్టర్, పోర్టు అధికారులను పిలిచి ఏం చేస్తున్నారు మీరంతా అంటూ మండిపడ్డారు. కాకినాడ జిల్లా ఎస్పీకి ఎన్నిసార్లు చెప్పినా కనీసం స్పందన లేదని దునుమాడారు. తాను జిల్లాకు ఎప్పుడు వచ్చినా సెలవుపై ఉంటున్నారు.. అంటూ ఆయనకు నోటీసులు పంపాలని ఆదేశించారు. కాకినాడ పోర్టు ప్రమాదకరంగా మారిందని, దీనిపై ప్రధాని, కేంద్ర హోంమంత్రికి లేఖ రాస్తానని హెచ్చరించారు.

యాంకరేజ్ పోర్టులో బియ్యం పరిశీలన

కాకినాడ పోర్టులో పవన్‌కల్యాణ్ శుక్రవారం మధ్యాహ్నం పర్యటించారు. తొలుత 12.45గంటలకు యాంకరేజ్ పోర్టులో బార్జిలో తనిఖీలు చేశారు. ఇందులో రేషన్ బియ్యం ఎగుమతి అవుతుండడంతో ఇటీవల అధికారులు పట్టుకున్నారు. నేరుగా పవన్ బార్జి ఎక్కి బియ్యం ప్లేటులో వేసి పరిశీలించారు. రేషన్ బియ్యం ఆనవాళ్లను గుర్తించారు. అక్కడే ఉన్న డీఎస్‌వో, కలెక్టర్, పోర్టు అధికారి, ఇతర అధికారులపై తీవ్రంగా మండిపడ్డారు. రేషన్ మాఫియాకు మీరంతా సహకరించకపోతే ఇలా ఎలా దేశాలు దాటిపోతోందని శివాలెత్తారు. ఉద్యోగాలు చేస్తున్నారా.. మాఫియాకు వంత పాడుతున్నారా? అంటూ మండిపడ్డారు. పక్కనే ఉన్న టీడీపీ ఎమ్మెల్యే కొండబాబును ఉద్దేశించి దీనిపై మరింత గట్టి పోరాటం చేయాలని, నెమ్మదిగా ఉండకూడదని పేర్కొన్నారు. అనంతరం అక్కడినుంచి మధ్యాహ్నం ఒంటి గంట తర్వాత డీప్‌వాటర్ పోర్టుకు చేరుకుని అక్కడి నుంచి టగ్ ఎక్కి సముద్రంలోకి వెళ్లారు.

సముద్రం అల్లకల్లోలంగా ఉన్నా..

తుఫాను నేపథ్యంలో సముద్రం అల్లకల్లోలంగా ఉండడంతో పవన్ సముద్రంలోకి వెళ్తారని అధికారులు అనుకోలేదు. కానీ అనూహ్యంగా ఆయన టగ్ ఎక్కి తొమ్మిది నాటికల్ మైళ్ల దూరంలో ఉన్న పశ్చిమ ఆఫ్రికా నౌక స్టెల్లా ఎల్ పనామా వద్దకు బయలుదేరారు. సముద్రం భయానకంగా ఉండడంతో అధికారులు వద్దని వారించారు. అయినా పవన్ వినలేదు. నౌకవద్దకు వెళ్లిన తర్వాత పైకి ఎక్కి ఎగుమతికి సిద్ధంగా ఉన్న 640 టన్నుల బియ్యాన్ని పరిశీలించాలి. కానీ వాతావరణం బాగోలేదని, నౌకపైకి ఎక్కొద్దని అధికారులు పవన్‌కు తెలిపారు. సముద్ర ప్రయాణం మధ్యలో పవన్ ఎమ్మెల్యే కొండబాబు సమక్షంలో అధికారులపై మండిపడ్డారు. రేషన్ మాఫియాపై ప్రభుత్వం సీరియస్‌గా ఉన్నా క్షేత్ర స్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయని అసహనం వ్యక్తంచేశారు. ఈ విషయంలో మొత్తం సివిల్ సప్లయిస్ డిపార్ట్‌మెంట్ ఫెయిల్ అయ్యిందన్నారు. డీఎస్‌ఓ ప్రసాద్, జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్, జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, పోర్టు అధికారి ధర్మ శాస్త్ర, డీఎస్పీ రఘువీర్‌పై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పీడీఎస్ బియ్యం ఉన్న స్టెల్లా ఎల్ పనామా భారీ నౌకను సీజ్ చేయాలని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశించారు. కాకినాడ యాంకరేజ్ పోర్టులో అధికారులు దృష్టిపెట్టాలన్నారు. పోర్టులోని రెండు చెక్‌పోస్టుల వద్ద 24 గంటలు నిఘా ఉండాలన్నారు.

కాకినాడలో రేషన్ మాఫియా

మధ్యాహ్నం 3 గంటల తర్వాత తిరిగి డీప్‌వాటర్ పోర్టుకు చేరుకున్న పవన్ విలేకరుల సమావేశంలో ప్రసంగించారు. రేషన్ మాఫియా కాకినాడలో దారుణంగా ఉందని, తనను నౌక ఎక్కనీయకుండా అధికారులు అడ్డుకున్నారని పేర్కొని సంచలన వ్యాఖ్యలు చేశారు. రెండు నెలలుగా కాకినాడ పోర్టులో తనిఖీలకు తనను రాకుండా అధికారులు ఏవో సాకులు చెప్పి అడ్డుకుంటున్నారని గుర్తుచేసి బాంబుపేల్చారు. తాను ఢిల్లీ నుంచి అమరావతి వెళ్లాలని, కానీ రేషన్ మాఫియా తీవ్రత నేపథ్యంలో కాకినాడ పర్యటనకు వచ్చానని తెలిపారు. విలేకరుల సమావేశం అనంతరం పవన్ అమరావతికి బయలుదేరి వెళ్లారు.

గ్రీన్‌ఛానల్ ద్వారా తరలింపు

అంతకుముందు మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ గత జూన్‌లో కాకినాడలో తనిఖీ చేసినప్పుడు 26వేల మెట్రిక్ టన్నులు పీడీఎస్ బియ్యం పట్టుకున్నామన్నారు. బియ్యం మాఫియా గుంటూరు, చిత్తూరు, శ్రీకాకుళం జిల్లా నుంచి గ్రీన్ ఛానల్ ఏర్పాటుచేసుకుని కాకినాడ పోర్టు నుంచి విదేశాలకు అక్రమంగా తరలిస్తున్నారన్నారు. పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు మాట్లాడుతూ అధికారంలో ఉన్నప్పుడు ద్వారంపూడి వ్యాపారం చేశారనీ, ఇప్పుడు బినామీలు ఈ దందా చేస్తున్నారని ఆరోపించారు.



బియ్యం పరిశీలిస్తూ...



డీఎస్పీ రఘువీర్‌ని ప్రశ్నిస్తున్న పవన్

నేడు పింఛన్ల పంపిణీ

రాజమహేంద్రవరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తిచేశామని కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. డిసెంబరు 1న ఆదివారం సెలవు దినం కావడంతో శనివారం పింఛన్లు ఇంటి వద్దకే తీసుకెళ్లి అందజేస్తామన్నారు. అలాగే మూడు నెలల పింఛను బకాయిలను కూడా ఇస్తామన్నారు. దీనికి జిల్లావ్యాప్తంగా 18 రూరల్, 3 పట్టణ మండలాల్లో 9,041 క్లస్టర్ల పరిధిలో 5,128 మంది సిబ్బందిని వినియోగిస్తున్నామని ఆమె చెప్పారు. మొత్తం 17 విభాగాల కింద 2,37,389 మందికి రూ.101 కోట్ల 63 లక్షల 33 వేలు పంపిణీ చేస్తామన్నారు. పింఛను లబ్ధిదారు మరణిస్తే జీవిత భాగస్వామికి ఆ పింఛను అందజేస్తామని తెలిపారు. ప్రామాణిక ఆపరేటింగ్ విధానంలో పింఛను మంజూరు పంపిణీ వ్యవస్థ అమలవుతోందని డీఆర్డీఏ పీడీ ఎన్‌వీవీఎస్ మూర్తి తెలిపారు. పింఛను లబ్ధిదారులు ఏ కార్యాలయానికి రావాల్సిన అవసరం లేదని, ప్రభుత్వ సిబ్బంది ఇంటికి తీసుకొచ్చి సగౌరవంగా పింఛను అందజేస్తారని తెలిపారు. ఏమైనా ఇబ్బందులు ఏర్పడినా వాటిని వెంటనే పరిష్కరించి పింఛను సొమ్ము ఇస్తామని తెలిపారు.



అనపర్తిలో మీడియాతో మాట్లాడుతున్న జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విశ్వేశ్వరరెడ్డి

అధికారంలోకి తేవడమే లక్ష్యం

జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి

అనపర్తి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడమే ధ్యేయంగా కార్యకర్తలు ముందుకుసాగాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. శుక్రవారం అనపర్తిలోని రైల్వే స్టేషన్ సమీపంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కన్వీనర్‌గా నియమితులైన సత్తి కృష్ణ చైతన్యరెడ్డి అధ్యక్షతన సమావేశం ఏర్పాటుచేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో, దేశంలో ప్రతిపక్ష పాత్ర వహిస్తున్నది కాంగ్రెస్ మాత్రమేనన్నారు. ప్రధానిగా రాహుల్‌ని, రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ షర్మిలారెడ్డిని చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. గత ఐదేళ్లలో వైఎస్ జగన్ రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారని, చివరకు అమెరికాలో కూడా రాష్ట్ర పరువును తీశారన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నిలబెట్టుకో వడంలో విఫలమైందన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించిన సత్తి కృష్ణచైతన్య రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మార్టిన్ లూథర్, రాజమహేంద్రి రూరల్ ఇన్‌చార్జి తాడాల కొండ్రాజు, జిల్లా మహిళా అధ్యక్షురాలు మోతా శారద తదితరులు పాల్గొన్నారు.

వర్క్‌స్పేస్‌కు అనువైన భవనాలను గుర్తించండి

కలెక్టర్ ప్రశాంతి



రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : పొరుగు పనిస్టేషన్ల ఏర్పాటుకోసం అనువైన స్థలాన్ని, భవన సముదాయాలను గుర్తించడంపై రెవెన్యూ అధికారులు దృష్టి పెట్టాలని కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్‌లో జరిగిన వీడియోకాన్ఫరెన్స్‌ను జేసీ చిన్నరాముడు, డీఆర్‌వో టీ సీతారామమూర్తిలతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పనిచేసే ప్రదేశాల్లో, ప్రభుత్వ ప్రైవేటు భవనాల్లో సౌకర్యవంతంగా ఉండే వర్క్‌స్పేస్‌తో కూడిన ప్రాంతాలను గుర్తించి నివేదిక అందజేయాలని స్పష్టం చేశారు. ఇందులో భాగంగా అర్బన్ ప్రాంతంలో, సమీప మండలాల్లో, రూరల్ మండలల కేంద్రాలలో తగిన భవన సముదాయాలు లేదా వర్క్ ప్లేసెస్‌ను గుర్తించి నిర్ధిత పట్టికలో అందజేయాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వ భవనాలు, మహిళా సమాఖ్య, ఎంపీడీవో కార్యాలయాలు, సచివాలయ భవనాలు, ఇతర ప్రభుత్వ శాఖల భవనాలతోపాటు ప్రైవేట్ వ్యక్తుల భవనాలు కూడా గుర్తించాలని సూచించారు. పొరుగు పని స్టేషన్లలో 24 గంటల విద్యుత్ సరఫరా, హైస్పీడ్ ఇంటర్నెట్, కార్పొరేట్ ఆఫీసు వసతులు కల్పించడం ద్వారా వర్క్‌ఫ్రమ్ హోమ్ చేసుకునే సౌలభ్యం కల్పించడం ముఖ్య ఉద్దేశమన్నారు. కాన్ఫరెన్స్‌లో వర్చువల్ ద్వారా కమిషనర్ కేతన్‌గార్గ్, ఆర్డీవోలు ఆర్.కృష్ణనాయక్, రాణిసుస్మిత తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం గొడౌన్ పరిశీలించిన కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఎన్నికల కమిషనర్ మార్గదర్శకాల మేరకు ప్రతి నెలా ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ గొడౌన్‌లను తనిఖీ చేస్తున్నామని కలెక్టర్ ప్రశాంతి అన్నారు. శుక్రవారం రాజమహేంద్రవరం ఎఫ్‌సీఐ గొడౌన్‌లోని ఉన్న ఈవీఎం గొడౌన్‌ను జిల్లా కలెక్టర్, ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్‌లు పరిశీలించారు. ఈవీఎం బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాట్స్‌లు నిరంతరం సీసీ కెమేరాల పర్యవేక్షణలో స్ట్రాంగ్ రూమ్‌లో ఉంచడం జరిగిందని కలెక్టర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పీహెచ్‌జీఆర్ పాపారావు, రెవెన్యూ, భద్రత సిబ్బంది పాల్గొన్నారు.

సంక్రాంతి కానుకగా కొత్త రేషన్ కార్డులు

వచ్చే నెల 2 నుంచి దరఖాస్తుల స్వీకరణ.. విభజన, మార్పులు, చేర్పులకు అవకాశం.. ఐదేళ్ల నిరీక్షణకు తెరదించిన కూటమి ప్రభుత్వం

రాజానగరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు తెల్ల రేషన్‌కార్డు ప్రామాణికంగా మారింది. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, దీపం-2 పథకం వర్తించాలన్నా, వితంతువులు, విభిన్న ప్రతిభావంతులకు, వృద్ధులకు పింఛను మంజూరు చేయాలన్నా, ప్రాథమికంగా తెల్ల రేషన్ కార్డు కలిగి ఉండాలి. ఇంతటి కీలకమైన కార్డుల మంజూరును గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. దరఖాస్తు చేసుకున్న పేదలు నెలలు, ఏళ్ల తరబడి నిరీక్షించినా నిరాశే మిగిలింది. మార్పులు, చేర్పులకు కూడా అవకాశం కల్పించకపోవడంతో వేలాది మంది లబ్ధిదారులు సంక్షేమ పథకాలకు దూరమయ్యారు. ఈ తప్పిదాన్ని సరిచేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కొత్త కార్డుల మంజూరుతోపాటు ఉన్న వాటి సవరణకు అవకాశం కల్పిస్తూ డిసెంబరు 2 నుంచి 28వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణకు కూటమి ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. రాష్ట్రవ్యాప్తంగా ఆరోజు కొత్త రేషన్ కార్డుల దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియకు శ్రీకారం చేస్తున్నట్టు సివిల్ సప్లయిస్ అధికారులు చెబుతున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో 867 చౌక దుకాణాలు ఉన్నాయి. వీటిలో తెల్లరేషన్ (బియ్యం)కార్డులు 5,54,360 ఉన్నాయి. అలాగే ఏఏవై (అంత్యోదయ అన్న యోజన) 20,547 కార్డులు ఉన్నాయి.

ఉన్నవి తొలగించారు...

అధికారంలోకి 2019లో వచ్చిన వైసీపీ ప్రభుత్వం అప్పటికే ఉన్న పాత కార్డులను కాదని, నాటి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చిత్రాలు, ఆ పార్టీ రంగులతో ముద్రించిన రేషన్ కార్డులను అందజేశారు. ఇందుకోసం ప్రజాధనం వృధా చేయడంతో పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తాయి. కొత్తకార్డులు కావాల్సినవారు దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి అయిదు రోజుల్లో మంజూరు చేస్తామంటూ గొప్పలు చెప్పుకొచ్చారు. కొత్తవి ఇవ్వకపోగా ఆరంచెల విధానంలో వడపోసి అప్పటికే ఉన్న కార్డులు తొలగించారు. ఇది చాలదన్నట్టు కుటుంబ సభ్యుల్లో ఎవరికైనా వివాహం జరిగితే, విభజన చేసుకునేందుకు అనుమతివ్వలేదు. పేర్లు తొలగింపు, చేర్పులకు అవకాశం ఇవ్వలేదు. దీంతో అప్పటివరకు ప్రభుత్వం సంక్షేమ రాయితీ పథకాలు పొందుతున్న వారంతా వాటికి దూరమైపోయారు. అంతేకాకుండా చంద్రన్న సంక్రాంతి కానుకలు, క్రిస్మస్, రంజాన్ తోఫా కానుకలను పూర్తిగా నిలిపివేశారు.

అర్హులందరికీ అవకాశం..

కూటమి ప్రభుత్వం నిర్ణయంతో బియ్యం కార్డుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. లబ్ధిదారుల అవస్థలు గుర్తించిన కూటమి ప్రభుత్వం రేషన్‌కార్డుల సమస్యల పరిష్కారం దిశగా కార్యాచరణ రూపొందించింది. కొత్తగా కార్డులు, మార్పులు, చేర్పుల కోసం వచ్చే నెల 2 నుంచి 28 వరకు గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తులు స్వీకరిస్తోంది. అర్హులను గుర్తించి సంక్రాంతి పండగ కానుకగా ఇవ్వాలని సంకల్పించింది. ఈ నిర్ణయంతో వేలాదిమంది పేద, మధ్య తరగతి కుటుంబాల్లో ఆశలు చిగురించాయి. ఇప్పటికే గత ముఖ్యమంత్రి చిత్రం, వైసీపీ రంగులతో ముద్రించిన పంచదార, కందిపప్పు ప్యాకింగ్‌ను మార్చారు. కార్డుల రంగులను కూడా మార్చి కొత్తవి అందజేయనున్నారు.

తెల్లకార్డులు మంజూరు చేయాలి..

ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణిస్తున్న అంగన్‌వాడీ, ఆశా, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న చిన్నపాటి ప్రభుత్వ ఉద్యోగులకు కూడా కూటమి ప్రభుత్వం తెల్లరేషన్ కార్డులకు వెసులుబాటు కల్పించాలని ఆయా శాఖలకు చెందిన ఉద్యోగులు ఎంతోకాలంగా వేడుకుంటున్నారు. చాలీచాలని జీతాలతో ప్రభుత్వ ఉద్యోగంలో కొనసాగుతున్న తాము ఆర్థిక సమస్యలతో సతమతం అవుతున్నామని, ముఖ్యంగా తమ పిల్లల చదువుల విషయంలో అమ్మఒడి, ఫీజురీయింబర్స్‌మెంట్ వంటి పథకాలు వర్తించక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని కూటమి ప్రభుత్వం తమ కుటుంబాలకు తెల్ల రేషన్ కార్డులు కేటాయించేలా పునఃపరిశీలించాలని సంబంధిత ఉద్యోగులు కోరుతున్నారు.

నిశీధిలో.. జీవనయాత్ర!

నగరం నిద్రపోయే వేళ వీరి దినచర్య మొదలు.. రాత్రంతా చెమటోడ్చే శ్రమజీవులు


స్వచ్ఛమైన సేవలు..


నిశీధిలో..




చెత్త.. తీసుకెళతాం

కాకినాడ నగరం.. నైట్ విజిట్

రాత్రి 10.. 11.. 12 గంటలకల్లా అంతా ఇళ్లకు చేరిపోతారు. నిశ్చింతగా నిద్రపోతారు. అర్ధరాత్రి గాఢ నిద్రలోకి జారుకుంటారు.. కానీ, నగరం నిద్రపోతున్న వేళ.. వీరంతా మేల్కొంటారు.. నిశ్శబ్దం రాజ్యమేలుతున్న వేళ.. వీరు పనిలో నిమగ్నమై ఉంటారు.. అసలు అర్ధరాత్రి బయటి ప్రపంచం చాలామందికి తెలీదు.. అసలు రాత్రంటే చీకటేనా.. కుక్కల అరుపులు, కప్పల చప్పుళ్లు, దోమపోట్లు.. ఇవేనా? అసలు రాత్రిపూట ఏం జరుగుతోంది.. అర్ధరాత్రి 12 గంటల నుంచి తెల్లవారుజాము 4 గంటల వరకు అంతా చీకటేనా..? అంటే అవును చీకటే.. అందరినీ నిద్రపుచ్చే చీకటి.. అందరికీ విశ్రాంతినిచ్చే చీకటి.. కానీ అదే చీకటి కొందరి జీవన యాత్రకు నాంది పలుకుతుంది. వారి జీవితాల్లో వెలుగులు విరజిమ్ముతోంది. వారిని నిదురకు దూరం చేసి.. మనకి నిద్రపట్టేలా చేస్తూ.. వారి బతుకు బండికి నిశీధిలో.. ఉషోదయం కలిగిస్తోంది. కాకినాడ నగరంలో గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు ఒక రాత్రంతా ఎలా ఉందో చూద్దాం.. రండి..!!




భానుగుడి జంక్షన్లో..


చలిలో.. వెచ్చటి కబుర్లు


మిడ్ నైట్ ఫుడ్ డెలివరీ


అర్ధరాత్రి ఆటో సర్వీస్



నైట్ పెట్రోలింగ్



ఎమర్జెన్సీ సర్వీస్


తెలవారక ముందే పేపర్ బాయ్స్..


రైతు బజార్లో సందడి..


ఎనీటైం.. పెట్రోల్ బంకు

అందరూ నిద్రపోయే వేళ.. వీరు నిశాచరుల్లా సంచరిస్తారు. కానీ వీరికి ఇప్పుడే జీవన యాత్ర మొదలవుతుంది. అర్ధరాత్రి మొదలై తెల్లవారుజామున ముగిసే పనుల్లో వారంతా బిజీగా ఉంటారు. కొందరు వేకువజామున మొదలై ఉషోద సమయానికి పనులు పూర్తి చేసేస్తారు. 'ఆంధ్రజ్యోతి' అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు విజిట్ చేసింది. గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు కనిపించిన దృశ్యాలను తమ కెమెరాలో బంధించింది. కాకినాడ నగరంలో నాలుగు లక్షల మంది జనాభా ఉన్నారు. వీళ్లంతా పొద్దున్న లేచేసరికి వీధులన్నీ పరిశుభ్రంగా ఉంటున్నాయంటే దానికి కారణం నగరపాలక సంస్థ పరిధిలోని నైట్ శానిటేషన్ వర్కర్స్ ఘనత.. రోజంతా వేసిన చెత్తను రాత్రివేళల్లో 52 మంది పారిశుధ్య కార్మికులు రాత్రి 10 గంటల నుంచి తెల్లవారుజామున 4 గంటల వరకు ఊడుస్తున్నారు. వీళ్ల పనితీరు వల్లే నగరం ఉదయానికి పరిశుభ్రంగా.. సుందరంగా ఉంటోంది. అదేవిధంగా జిల్లా నలుమూలల నుంచి వివిధ గ్రామాల్లో పండించిన పంటలను వందలమంది రైతులు కాకినాడ పెద్ద మార్కెట్‌కు తెల్లవారుజామున రెండు, మూడు గంటల నుంచి తీసుకొస్తుంటారు. దీంతో ఆ సమయంలో పెద్ద మార్కెట్ రైతులు, వర్కర్లు, కొనుగోలుదారులతో సందడిగా ఉంది. ఇక నగరంలో ప్రధాన కూడళ్లు సర్పవరం జంక్షన్, భానుగుడి జంక్షన్, త్రీలైట్ జంక్షన్, మసీదు సెంటర్, జగన్నాథపురం వంటి ప్రాంతాల్లో ఆరోగ్య మెడికల్స్, అపోలో, కీర్తి, మెడ్‌ప్లస్ సహా మరిన్ని మెడికల్ షాపులు 24/7 సేవలందిస్తున్నాయి. రాత్రిపూట ఎవరికి అత్యవసరంగా మందులు కావాలన్నా వీటిని ఆశ్రయిస్తున్నారు. నగరంలోని గాంధీనగర్‌లో దిగువన ఉన్న నైట్ హోటల్ కాకినాడలో ఎంతో ఫేమస్. రాత్రి ఏడు గంటల నుంచి అర్ధరాత్రి ఒంటి గంట వరకు నగర ప్రజలకు అందుబాటులో ఉంటుంది. రాత్రి వేళల్లో ఇడ్లీ, పూరి, చపాతి, పరోట, ఉప్మా, దోసెలు అందిస్తారు. ఇలా మరికొన్ని హోటళ్లు అర్ధరాత్రి వరకు ఉంటుండగా, తెల్లవారుజాము నాలుగు గంటల నుంచి చాలా హోటళ్లు తెరచుకుంటున్నాయి. ఇది శీతాకాలం.. చలిలో వేడివేడి టీ తాగితే ఆ మజానే వేరు. కాకినాడ భానుగుడి సెంటర్‌లో తెల్లవారుజామున మూడు గంటల నుంచి చార్మినార్ టీ సెంటర్‌లో టీ దొరుకుతుంది. ఆ సమయంలో అక్కడ ఎంతో రద్దీ కనిపిస్తుంది. రాత్రి సమయాల్లో బయటకి వచ్చి కాసేపు అలా తిరిగి ఐస్‌క్రీమ్ తినే అలవాటు కొందరికి ఉంటుంది. వీరి కోసం నగరంలోని మెయిన్‌రోడ్డు, భానుగుడి సెంటర్, జేఎన్టీయూ, ఆశ్రమ్ పబ్లిక్ స్కూల్ సెంటర్లలో అర్ధరాత్రి ఒంటి గంట వరకు ఐస్ క్రీమ్ బళ్లు అందుబాటులో ఉంటున్నాయి. చలికాలంలోనూ వీటి దగ్గర జనం కనిపించడం విశేషం. అరటిపళ్లు అమ్ముకునేవాళ్లు, స్విగ్గీ, జొమాటో వంటి ఫుడ్ డెలివరీ బాయ్స్ వంటివారు అర్ధరాత్రి 2 గంటల వరకు కనిపిస్తున్నారు. ఈ ఫుడ్ సర్వీసు కంపెనీలు అర్ధరాత్రి దాకా అధిక కమీషన్లు ఇచ్చి సర్వీస్ బాయ్‌లను అందుబాటులో ఉంచుతున్నాయి. అలాగే పెట్రోల్ బంకుల్లో కార్మికులు, ఆర్టీసీ కార్గో సేవల్లో కార్మికులు, ఆటోడ్రైవర్లు, నైట్ డ్యూటీ పెట్రోలింగ్ పోలీసులు, ఏటీఎంలతోపాటు ఆస్పత్రులు, ప్రధాన కార్యాలయాల వద్ద సెక్యూరిటీ గార్డులు కూడా రాత్రంతా మనకి తారసపడుతుంటారు.

అర్ధరాత్రి అందాల కనువిందు

ప్రజలంతా హాయిగా నిద్రపోతున్న వేళలో నగరం విద్యుత్ కాంతులతో ఎంతో ఆహ్లాదకరంగా.. అందంగా కనిపిస్తుంది. మెయిన్‌రోడ్డు, భానుగుడి జంక్షన్ నుంచి అచ్చంపేట జంక్షన్ వరకు రోడ్డుకు ఇరువైపున చెట్లు, డివైడర్ మధ్యలో ఉన్న మొక్కల మధ్య విద్యుద్దీపాలు ఆకట్టుకుంటాయి. చలికాలంలో కావడంతో కొన్నిచోట్ల రాత్రిపూట, తెల్లవారుజాము సమయాల్లో చలిమంటలు కూడా కనిపిస్తున్నాయి.

- ఆంధ్రజ్యోతి/ కాకినాడ కార్పొరేషన్
ఫొటోలు/ ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్





అన్నవరం నూతన ఈవోగా సుబ్బారావు

అన్నవరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం సత్యదేవుని ఆలయానికి నూతన ఈవోగా వీర్ల సుబ్బారావును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన ప్రస్తుతం ఏపీ ఎయిర్‌పోర్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో డిప్యూటీ కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. దేవదాయ శాఖ అదనపు కమిషనర్‌గా ఉన్న రామచంద్రమోహన్‌ను రెండు రోజుల క్రితం ఆకస్మికంగా బదిలీ చేసి సింహాచలం ఈవో త్రినాథరావుకు అన్నవరం అదనపు బాధ్యతలు అప్పగించారు. అయితే తాజాగా ఈ ఉత్తర్వులు వెలువడడం విశేషం. సుబ్బారావు కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచీ అన్నవరం ఈవోగా వచ్చేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. అయితే రెవెన్యూ శాఖ నుంచి రిలీవ్ కావడం ఆలస్యమైంది. ప్రభుత్వం 64 మంది డిప్యూటీ కలెక్టర్ల పోస్టింగ్ ఉత్తర్వుల్లో అవకాశం దక్కించుకున్నారు. అమావాస్య వెళ్లిన తర్వాత నూతన ఈవో బాధ్యతలు స్వీకరిస్తారని దేవస్థానం వర్గాలు వెల్లడించాయి.

వనదుర్గ ఆలయంలో చండీ హోమం

అన్నవరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి క్షేత్రరక్షకి వనదుర్గ ఆలయంలో శుక్రవారం చండీ హోమం ఘనంగా జరిగింది. ఉదయం తొమ్మిది గంటలకు పండితులు గణపతి పూజ, పుణ్యాహవచనం అనంతరం అమ్మవారికి చండీ, సప్తసతి పారాయణలు, మూలమంత్ర జపాలు పఠించారు. 11 గంటలకు హోమ గుండంలో సుగంధ ద్రవ్యాలు అర్పించి పూర్ణాహుతి గావించారు.

రేపు కాకినాడ సాగర తీరంలో మహా కుంభాభిషేకం



కాకినాడ సిటీ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ సాగర తీరంలో మంగళాంబికా సమేత ఆదికుంభేశ్వరస్వామి 49వ మహా కుంభాభిషేకాన్ని ఆదివారం కార్తీక అమావాస్య రోజున నిర్వహించేందుకు సన్నాహాలు చేశారు. రెండు రోజులుగా ఆలయ పరిసర ప్రాంతాలను ముస్తాబు చేయించి మహా శివలింగం ఆకారంలో కోటి శివలింగాలను అమర్చారు. శుక్రవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆలయ కమిటీ సభ్యులు తాతయ్యనాయుడు, తోట పుండరీకాక్షయ్య (బాబి), చిట్నీడి శ్రీనివాస్, గంగాపాత్రుని శ్రీనివాసు మాట్లాడుతూ మహా కుంభాభిషేకంలో పాల్గొనేందుకు వచ్చే భక్తుల సౌకర్యార్థం స్నానఘట్టం ఏర్పాటు చేయించామని తెలిపారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. భక్తులు భారీగా తరలివచ్చి స్వామిని దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించాలని కోరారు.


మహా కుంభాభిషేకం వివరాలు వెల్లడిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

పంచారామ క్షేత్రాల్లో హైకోర్టు న్యాయమూర్తి పూజలు


సామర్లకోటలో న్యాయమూర్తి సుజాతకి స్వామి, అమ్మవార్ల చిత్రపటం ఇస్తున్న ఈవో

సామర్లకోట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హైకోర్టు జడ్జి వి.సుజాత కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం కుమార రామ భీమేశ్వరాలయానికి విచ్చేశారు. ఆమెకు ఈవో బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో పండితులు సాదర స్వాగతం పలికారు. భీమేశ్వరస్వామికి అభిషేకాలు, బాలాత్రిపురసుందరి అమ్మవారికి పుష్పార్చన జరిపారు. పండితులు ఆమెకు నంది మండపం వద్ద వేదాశీర్వచనం ఇవ్వగా ఈవో నీలకంఠం శేష వస్త్రాలు, స్వామి, అమ్మవార్ల చిత్రపటం అందజేశారు. ధ్వజస్తంభం వద్ద దీపం వెలిగించారు. న్యాయమూర్తి వెంట డిప్యూటీ తహసీల్దారు వై.శ్రీనివాస్, సీఐ శ్రీకృష్ణభగవాన్, వీఆర్వోలు నలజర్ల మురళీకృష్ణ, నూతలపాటి లోవరాజు, ఆలయ సిబ్బంది వున్నారు.

ద్రాక్షారామ (ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వరాలయానికి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.సుజాత శుక్రవారం విచ్చేశారు. భీమేశ్వర స్వామి, మాణిక్యాంబ అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆమెకు దర్శనానంతరం బేడా మండపంలో వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చారు.

సత్యదేవుని సన్నిధిలో సహస్ర జ్యోతిర్లింగార్చన

అన్నవరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుని సన్నిధిలో కార్తీక బహుళ త్రయోదశిని పురస్కరించుకుని శుక్రవారం రాత్రి అనివేటి మండపంలో జ్యోతిర్లింగార్చన వైభవంగా జరిగింది. ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో కల్యాణబ్రహ్మ చామర్తి కన్నబాబు, పాలంకి చినపట్టాభి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు శివలింగాకారంలో జ్యోతులను అలంకరించగా రుత్వికులు వెలిగించారు.




వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ ప్రశాంతి, ఎయిర్‌పోర్టు డైరెక్టర్ జ్ఞానేశ్వర్

విమానాశ్రయ విస్తరణ పనుల్లో పురోగతి

కోరుకొండ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మధురపూడి విమానాశ్రయ విస్తరణ పనులు షెడ్యూలుకు అనుగుణంగా పురోగతిలో ఉన్నాయని తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, ఎయిర్‌పోర్టు అథారిటీ డైరెక్టర్ ఎస్.జ్ఞానేశ్వర్ పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం నైపుణ్యాభివృద్ధి, ఇన్‌ఫ్రా డెవలప్‌మెంట్ శాఖల ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్ అమరావతి నుంచి విమానాశ్రయ పనులపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ భూ సేకరణకు చెందిన మ్యుటేషన్ పూర్తికాగా ఐదు ఎకరాలకు సంబంధించిన పనులు ఈ వారంలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. రెండు కోర్టు కేసులు పెండింగులో ఉన్నాయన్నారు. వ్యవసాయ క్షేత్రాలకు అనుసంధానం, రహదారి మార్గం కూడా పరిష్కరించాల్సి ఉందన్నారు. ఆర్థికపరమైన అంశాల నేపథ్యంలో వాటి పరిష్కారం దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. ఎయిర్‌పోర్టు అథారిటీ డైరెక్టర్ ఎస్.జ్ఞానేశ్వర్, డీజీఎం శ్రీనివాసులు పనుల పురోగతిపై వివరాలు తెలిపారు. రూ.173.28 కోట్లతో చేపట్టనున్న పనుల్లో ఆర్‌బీసీ పనులు 99శాతం పూర్తయ్యాయని, మాన్సన్ పనులు 25శాతం, మాట్రికేషన్ పనులు 20 శాతం పూర్తి చేశామన్నారు. 2025 ఆగస్టు 11 నాటికి పనులన్నీ పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.


దాతలకు స్వామివారి చిత్రపటం ఇస్తున్న దృశ్యం

అన్నదాన భవన నిర్మాణానికి రూ.5 లక్షల విరాళం

ఆత్రేయపురం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన కొప్పూరి శివశంకరరెడ్డి-పద్మ దంపతులు రూ.5.01 లక్షలు విరాళం సమర్పించారు. దాతలకు ఉప కమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు స్వామివారి చిత్రపటం అందజేశారు. శుక్రవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామిని దర్శించుకున్నారు. క్షేత్ర పాలకుడు అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. అధిక సంఖ్యలో మహిళలు దీపాలంకరణ జరిపారు. అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవలద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.4,03,235 లభించినట్టు ఈవో సూర్యచక్రధరరావు చెప్పారు.

కొంగలు.. కనువిందు



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ఇప్పనపాడులో పంట పొలాలు దమ్ము చేస్తున్న వేళ కొంగలు సందడి చేసిన దృశ్యాన్ని ఆంధ్రజ్యోతి కెమెరా క్లిక్ మనిపించింది. -మండపేట

బిక్కవోలులో అంతర జిల్లాల బాల్ బ్యాడ్మింటన్ పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న బిక్కవోలు ఎస్ఐ, ఆడుతున్న శ్రీకాకుళం-పశ్చిమ గోదావరి జట్లు

బిక్కవోలు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): గెలుపు, ఓటములను క్రీడా స్ఫూర్తితో తీసుకోవాలని బిక్కవోలు ఎస్ఐ వి.రవిచంద్రకుమార్ క్రీడాకారులకు సూచించారు. అంతర జిల్లాల బాలికల బాల్ బ్యాడ్మింటన్ పోటీలను తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు జడ్పీ హైస్కూల్ ప్లస్ పాఠశాలలో శుక్రవారం ఆయన ప్రారంభించారు. ముందుగా జాతీయ పతాకాన్ని, క్రీడా పతాకాన్ని ఆవిష్కరించారు. బిక్కవోలులో బాల్ బ్యాడ్మింటన్ క్రీడను ప్రోత్సహించి ఎంతోమంది జాతీయస్థాయి క్రీడాకారులను తయారు చేసి ఉద్యోగవకాశాలు కల్పించిన జాతీయ క్రీడాకారుడు మానుకొండ వీర్రాఘవరెడ్డి సేవలను ఎస్ఐ కొనియాడారు. రాష్ట్రంలోని ఉమ్మడి 13 జిల్లాల నుంచి వచ్చిన బాలికా క్రీడాకారుల నుంచి ఆయన గౌరవ వందనం స్వీకరించి పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్ఎం పి.వీరప్రభాకరరావు, పాఠశాల క్రీడా సమాఖ్య జిల్లా కార్యదర్శి స్వామి, జిల్లా డీఎస్డీవో శేషగిరిరావు, స్టేట్ అబ్జర్వర్ రజనీదేవి, పీడీల అసోషియేషన్ అధ్యక్షుడు ప్రసాద్, అనపర్తి జోన్ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి రాఘవరెడ్డి, పీడీలు బంగార్రాజు, ధనరాజు, యువరాజారెడ్డి, శ్రీనివాసరెడ్డి, రాఘవరెడ్డి, అప్పారెడ్డి, ప్రభాకరరెడ్డి, జావేద్, వీకేఆర్ తంబి పాల్గొన్నారు.

సెమీస్‌కు చేరిన శ్రీకాకుళం, గుంటూరు జట్లు

రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి జట్లు పాల్గొన్నాయి. మొత్తం జట్లను నాలుగు పూల్స్‌గా విడదీయగా శుక్రవారం జరిగి పోటీల్లో పూల్ ఏ నుంచి శ్రీకాకుళం జట్టు పశ్చిమ గోదావరిపై గెలుపొంది సెమీస్‌కు చేరింది. పూల్ సీ నుంచి గుంటూరు జట్టు కర్నూలుపై గెలిచి సెమీస్‌కు చేరుకుంది. వెలుతురు లేమి కారణంగా క్వార్టర్ ఫైనల్స్‌కు చేరిన ప్రథమ, ద్వితీయ జట్లు పూల్ బిలో విజయనగరం-తూర్పుగోదావరి, పూల్ డిలో విశాఖ-ప్రకాశం జట్ల మధ్య జరగవలసిన సెమీ ఫైనల్ పోటీలు శనివారానికి వాయిదా వేశామని, ఈ పోటీలతో పాటు సెమీస్, ఫైనల్స్ నిర్వహించి పోటీలు ముగిస్తామని జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య కార్యదర్శి స్వామి తెలిపారు.

లోడు లారీల బీభత్సం

- బండ రాళ్ల లారీని ఢీకొన్న ఐరన్ లోడు లారీ
- హైవేపై పడ్డ బండరాళ్లు
- నిలిచిన వాహనాల రాకపోకలు
- తప్పిన పెను ప్రమాదం



రాజానగరం-కలవచర్ల జంక్షన్‌లో రోడ్డుపై పడ్డ బండరాళ్లు



ప్రమాద స్థలంలో లారీలు

రాజానగరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై రాజానగరం-కలవచర్ల జంక్షన్‌లో శుక్రవారం రాత్రి గ్రానైట్ బండరాళ్ల లోడుతో వెళ్తున్న లారీని ఐరన్ లోడుతో వస్తున్న మరో లారీ ఢీకొంది. స్థానికుల వివరాలు ప్రకారం.. రాజమహేంద్రవరం వైపు నుంచి కాకినాడ పోర్టుకు మూడు బండరాళ్లతో వెళ్తున్న ట్రాలీ లారీ మార్గమధ్యలో రాజానగరం హైస్కూల్ సమీపంలో ఏడీబీ రోడ్డు వైపుగా మలుపు తిరుగుతోంది. ఈ సమయంలో వైజాగ్ నుంచి ఐరన్ ఊచల లోడుతో రాజమహేంద్రవరం వైపుగా వస్తున్న లారీ.. బండ రాళ్లతో మలుపు తిరుగుతున్న లారీని ఢీకొంది. దీంతో ట్రాలీపై ఉన్న 3 గ్రానైట్ బండ రాళ్లలో 2రాళ్లు హైవేపై పడిపోయి హైవేపై వాహనాలు రాకపోకలు నిలిచి పోయాయి. ఈ ప్రమాదంలో ఐరన్ ఊచల లోడు లారీ డ్రైవర్‌కు గాయాలు కావడంతో ఆటోలో చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న రాజానగరం ఎస్ఐ నాగార్జున సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించే దిశగా చర్యలు చేపడుతున్నారు. కాగా ప్రమాదం జరిగిన సమయంలో ఏవిధమైన వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఒకవేళ ఆ బండ రాళ్లు ఏ వాహనం పడినా ఈ పాటికి ప్రయాణికుల ప్రాణాలు గాలిలో కలిసిపోయే పరిస్థితులు ఈ ప్రాంతంలో ఉండేవనే చెప్పాలి.

లారీలతో రహదారులు ఛిద్రం..

నిబంధనలకు విరుద్ధంగా పరిమితి, పరిమాణానికి మించి భారీ బండ రాళ్లతో నిత్యం ఈ మార్గంలో లారీలు వెళ్లడం వల్ల రహదారులు కొంతకాలానికే ఛిద్రంగా మారుతున్నాయి. ఈ భారీ బండ రాళ్ల లారీల తాకిడి వల్లే ఏడీబీ రహదారి దారుణంగా తయారైంది.

నేమాంలో మాక్ డ్రిల్

గెయిల్ ఆధ్వర్యంలో నిర్వహణ



మాక్ డ్రిల్‌లో భాగంగా గ్యాస్ లీకేజీ ఘటనలో అస్వస్థతకు గురైన రైతులను అంబులెన్స్‌లోకి తరలిస్తున్న దృశ్యం



పైపులైన్ నుంచి లీకవుతున్న గ్యాస్‌ని అదుపులోకి తీసుకువస్తున్న అగ్నిమాపక సిబ్బంది

సర్పవరం జంక్షన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ సముద్రతీర ప్రాంతం నేమాం జగన్మోహనపురంలో శుక్రవారం గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (గెయిల్) సంస్థ ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. గెయిల్ సంస్థ జీఎం వై.ఏకుమార్ ఆధ్వర్యంలో ఓఎన్‌జీసీ, వేదాంత, కెయిర్న్‌ల సంయుక్త భాగస్వామ్యంలో ఆఫ్ సైట్ మాక్ డ్రిల్ కార్యక్రమం నిర్వహించారు. గ్యాస్ లీకేజీ జరిగినప్పుడు, జరుగుతున్న సమయం, తర్వాత తీసుకునే నివారణ, సహాయక చర్యలపై సిబ్బంది ప్రదర్శనాత్మకంగా విన్యాసాలు నిర్వహించారు. గ్యాస్ లీకేజీ జరిగిన వెంటనే కంట్రోల్ రూమ్‌కి సమాచారం, అక్కడ నుంచి విపత్తు నివారణ కోసం పనిచేసే యంత్రాంగం, సిబ్బందికి సమాచారం వెళ్లడం, నివారణ చర్యలను సిబ్బంది విన్యాసం చేసి చూపించారు. ఈ సందర్భంగా జీఎం వైపీ కుమార్ మాట్లాడుతూ గ్యాస్ లీకేజీపై ప్రజలను అప్రమత్తం చేయడం, విపత్తుల నివారణ కోసం పునశ్చరణ కార్యక్రమం ఆఫ్ సైట్ మాక్ డ్రిల్ నిర్వహించడం జరిగిందన్నారు. నెలకోసారి ఆన్ సైట్‌లో సేఫిటీ భద్రత, ప్రమాదాల నివారణ కోసం తీసుకునే చర్యలపై డ్రిల్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రామ సర్పంచ్ రాందేవు చిన్న, అగ్నిమాపక కేంద్రం అధికారి టీవీఎస్ రాజేష్, డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహనాయక్, ఏడీఎఫ్‌వో సుబ్బారావు, ఎంపీడీపీ పసుపులేటి సతీష్, తహశీల్దార్ వీఎల్ఎన్ కుమారి, ఈవోపీఆర్డీ శ్రీరామ ఆంజనేయులు, రిజర్వు డీఎస్పీ తదితరులు పాల్గొనారు.

ప్రాణం తీసిన ఈత సరదా

చెరువులో మునిగి విద్యార్థి మృతి



మరణించిన జ్యోతిప్రకాష్

నల్లజర్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఈత సరదా విద్యార్థి ప్రాణం తీసింది. స్థానికుల వివరాల ప్రకారం.. తుర్పుగోదావరి జిల్లా నల్లజర్లకు చెందిన గుడిసే మణికంఠ కుమారుడు జ్యోతిప్రకాష్(15) స్థానిక జడ్పీ హైస్కూల్లో 9వ తరగతి చదువుతున్నాడు. తన స్నేహితులైన జంపెల్లి రాజేశ్(10వ తరగతి), ములపర్తి హేమంత్‌కుమార్(7వ తరగతి), తాడి యువరాజ్(9వ తరగతి)లతో కలిసి శుక్రవారం స్కూల్ మానివేసి హెచ్‌పీ గ్యాస్ గోడౌన్స్ వద్ద ఉన్న పేరంటాల గుంట చెరువులో సరదగా ఈత కొట్టడానికి వెళ్లారు. స్నానం చేస్తుండగా ప్రకాశ్ ఊబిలో దిగిపోవడంతో స్నేహితులు లాగే ప్రయత్నం చేశారు. అయినా ప్రయోజనం లేకపోవడంతో అక్కడకు చేరుకున్న స్థానికులు బయటకు తీసుకుని వచ్చి గ్రామంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే ప్రకాశ్ మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. స్కూల్‌కి వెళ్తున్నానని చెప్పి విగతజీవిగా మారిన కుమారుడి మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.

జీజీహెచ్‌లో రక్తం గ్రూపు మార్చేసిన వివాదంపై విచారణ

జీజీహెచ్(కాకినాడ), నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌లో ఒక గ్రూపునకు బదులు మరో గ్రూపు రక్తం ఎక్కించి ఓ మహిళ మృతికి కారణమైన కేసులో బాధ్యులపై చర్యలు తీసుకునేందుకు శుక్రవారం విచారణ ప్రారంభమైంది. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు మండలం వలమారు గ్రామానికి చెందిన భావన శిరీష(34) అనారోగ్యంతో కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఈనెల 26న ఆమెకు డయాలసిస్ చేసిన అనం తరం రక్తం ఎక్కించగా అది ఓపాజిటివ్ కాకుండా ఏబీ పాజిటివ్ ఎక్కించడంతో ఆ రోగి బిగుసుకుపోయి మృతిచెందిన విష యం తెలిసిందే. అనంతరం కలెక్టర్ షాన్ మోహన్ ఆదేశాలతో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి విచారణ కమిటీని నియమించారు. కమిటీ చైర్మన్‌గా మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ రామరాజు, సభ్యులుగా ఎమర్జెన్సీ మెడిసిన్ హెచ్‌వోడీ డాక్టర్ సత్యవేణి, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ కోనాల అనిత ఉన్నారు. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు ఈ కమిటీ విచారణ చేపట్టింది. ఏఎంసీయు-2లో శిరీష మృతిచెందిన సమయంలో విధులు నిర్వర్తిస్తున్న వైద్యులు, వైద్యవిద్యార్థులు, నర్సింగ్ సిబ్బంది నుంచి కమిటీ వివరాలు సేకరించింది. విచారణ కమిటీ నివేదికను శుక్రవారం రాత్రి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారికి అందజేసింది.

రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలకు 30మంది ఎంపిక

పిఠాపురంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్చరీ పోటీలు



ఎంపిక పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

పిఠాపురం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలకు 30మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. కాకినాడ జిల్లా పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానం ఆవరణలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్చరీ జట్ల ఎంపికకు శుక్రవారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్చరీ పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరచిన 30మంది క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశామని, వారు విజయవాడలో డిసెంబరు 3నుంచి 5వ తేదీ వరకూ జరిగే రాష్ట్రస్థాయి సీనియర్స్ ఆర్చరీ పోటీల్లో పాల్గొంటారని అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జేఎస్ఎస్ గోపాలకృష్ణ, పి.లక్ష్మణరావు తెలిపారు. పోటీల్లో విజేతలు, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనవారికి పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ బహుమతులు అందజేశారు. అంతకు ముందు పోటీలను జనసేన నేతలు జోగా వెంకటరమణ, మార్నీడి రంగబాబు, సతీష్ ప్రారంభించారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా జి.శివప్రసాద్, కె.చిన్నబ్బాయి, బి.కృష్ణార్జున వ్యవహరించారు.

కొనసాగుతున్న సాఫ్ట్‌బాల్ పోటీలు

సెమీస్‌కి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జట్టు



కాకినాడ డీఎస్ఏలో సాఫ్ట్‌బాల్ పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

కాకినాడ రూరల్, నవంబరు29(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా క్రీడామైదానంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు శుక్రవారం కూడా కొనసాగాయి. మొదటి క్వార్టర్ ఫైనల్ పోటీలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్టు అనంతపురం జిల్లా జట్టుపై 8-4 స్కోర్ తేడాతో గెలిచి సెమీస్‌కి చేరినట్టు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి లంకా జార్జి తెలిపారు. అదేవిధంగా మరొక క్వార్టర్ ఫైనల్ పోటీలో శ్రీకాకుళం జిల్లా జట్టు నెల్లూరు జిల్లా జట్టుపై 11-6 స్కోర్ తేడాతోనూ, విజయనగరం జిల్లా జట్టు గుంటూరు జిల్లా జట్టుపై 3-1స్కోర్ తేడాతో, కడప ప్రకాశం జిల్లా జట్టుపై 10-2 స్కోర్ తేడాతోనూ గెలిచి సెమీస్‌కి చేరాయన్నారు. పోటీలను తూర్పుగోదావరి జిల్లా సాఫ్ట్‌బాల్ సంఘ కార్యదర్శి ఏఎస్ రాంప్రసాద్, పరిశీలకులు ఈశ్వరరావు, పీఈటీ సంఘ అధ్యక్ష కార్యదర్శులు రవిరాజు, నూకరాజు పర్యవేక్షించారు.

ఆటో బోల్తా పడి ఆరుగురికి తీవ్రగాయాలు



క్షతగాత్రులను అంబులెన్స్‌లో తరలిస్తున్న దృశ్యం



చిన్నింపేట జాతీయ రహదారిపై డివైడర్‌ను ఢీకొన్న ఆటో

ఏలేశ్వరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆటో బోల్తా పడి కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలంలోని చిన్నింపేట జీడిపిక్కుల పరిశ్రమకు చెందిన కార్మికులకు తీవ్రగా యాలయ్యాయి. శుక్రవారం సాయంత్రం కార్మికులు ఫ్యాక్టరీ వద్ద తమ సమస్యలపై ధర్నా చేసి అక్కడి నుంచి పెద్దనాపల్లికి గ్రామానికి ఆటోలో బయలుదేరారు. 13మంది ప్రయాణిస్తున్న ఆటో జాతీయ రహదారిపై డివైడర్‌ను బలంగా ఢీకొని బోల్తా పడింది. దీంతో ఆరుగురు మహిళలకు తీవ్రగాయాలు అయ్యాయి. కుప్పల దేవి(29), కీర్తి రత్న కుమారిరి (30), కీర్తి నాగమణి(45), బుద్దా రాణి(40), శరకణం భూలక్ష్మీ(45),శరకణం జగ్గుబాను(48)కు గాయాలు పాలవ్వడంతో వారిని చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.

తునిలో మతిస్థిమితం లేని వ్యక్తి హల్‌చల్



మతిస్థిమితం లేని యువకుడిని తండ్రికి అప్పగిస్తున్న రైల్వే పోలీసులు

తుని రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని రైల్వేస్టేషన్‌లో మతిస్థిమితం లేని 25ఏళ్ల వ్యక్తి హల్‌చల్ చేసి భయభ్రాంతులకు గురిచేశాడు. స్టేషన్ మాస్టర్ రూమ్‌లోకి ప్రవేశించడంతో స్టేషన్‌మాస్టర్ పోలీసులకు ఫిర్యాదు అందించారు. దీంతో రైల్వే పోలీసులు ఆ యువకుడి గురించి ఆరా తీశారు. సంబంధిత వ్యక్తి చెన్నై-హౌరా ఎక్స్‌ప్రెస్ నుంచి తునిలో దిగినట్లు కనుగొన్నారు. ఆ యువకుడి పేరు షేక్ రిఫన్‌గా తెలుసుకుని వారి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. వెస్ట్‌బెంగాల్‌కు చెందిన యువకుడి తల్లి దండ్రులను రప్పించి రిఫన్‌ను అప్పగించారు.

దుర్గాడలో ప్రత్యేక పూజలు

గొల్లప్రోలు రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో ఉన్న పంచాయతన సమేత ఉమారామలింగేశ్వరస్వామికి మా సశివరాత్రి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు, 21 రకాల ద్రవ్యాలు, 11 రకాల రుద్రాలతో స్వామికి అభిషేకం నిర్వహించారు.



ప్రత్యేక అలంకారంలో రామలింగేశ్వరస్వామి

నిజాయితీ చాటుకున్న ఆటోడ్రైవర్

రావులపాలెం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): బంగారు ఆభరణాలు ఉన్న బ్యాగును ఆటోలో మర్చిపోయిన ఆ డ్రైవర్ నిజాయితీతో పోలీసుల ద్వారా బాధితులకు అందచేసి నిజాయితీ చాటుకున్నాడు. డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ఉచ్చిలికి చెందిన మానేపల్లి పుష్పవతి బంధువుల ఇంటికి వెళ్లేందుకు ఉచ్చిలిలో ఆటో ఎక్కారు. ఆమె రావులపాలెంలో ఆటోలోనే బ్యాగుమర్చిపోయి దిగివెళ్లిపోయారు. అనంతరం ఆటోలో బ్యాగును గుర్తించిన ఆటో డ్రైవర్ మండేలా శివన్నారాయణ స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వచ్చి అప్పగించి వివరాలు చెప్పాడు. పోలీసులు ఆ బ్యాగును తెరిచి చూడగా బంగారు ఆభరణాలు ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఆమెను ఫోన్ ద్వారా స్టేషన్‌కు పిలిపించి సీఐ శేఖర్‌బాబు ఆధ్వర్యంలో ఎస్ఐ చంటి సిబ్బంది ఆమెకు బ్యాగును అప్పగించారు. ఆ బంగారు ఆభరణాల విలువ రూ.5లక్షలు ఉంటుందని నిజాయితీతో తన బ్యాగును తిరిగి అప్పగించినందుకు ఆటోడ్రైవర్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. నిజాయితీని చాటుకున్న శివన్నారాయణను సీఐ శేఖర్‌బాబు అభినందించారు.



రావులపాలెం పోలీస్‌స్టేషన్‌లో బ్యాగును పోలీసుల సమక్షంలో బాధితులకు అందిస్తున్న ఆటోడ్రైవర్

విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి తోడ్పాటు

తిరుపతి ఐఐటీ టెక్నాలజీ ఇంక్యుబేషన్ హబ్ ప్రాజెక్టు డైరెక్టర్ రోషన్ శ్రీవాత్సవ్




బూట్ క్యాంప్‌నకు హాజరైన శ్రీవాత్సవ్, ప్రముఖులు, పాఠశాలల ఉపాధ్యాయులు

రాజానగరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): తిరుపతి ఐఐటీ గ్రామీణ విద్యార్థులకు సృజనాత్మకతతో కొత్త ఆవిష్కరణలకు అవసరమైన నైపుణ్యాభివృద్ధికి తోడ్పాటు అందిస్తోందని తిరుపతి ఐఐటీలోని టెక్నాలజీ ఇంక్యుబేషన్ హబ్ ప్రాజెక్టు డైరెక్టర్ రోషన్ శ్రీవాత్సవ్ అన్నారు. గోదావరి గ్లోబల్ యూనివర్శిటీ (జీజీయూ)లోని ఐసీటీ సౌజన్యంతో ఇన్నోవేషన్ డిజైన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ (ఐడీఈ)బూట్ క్యాంప్ శుక్రవారం ప్రారంభమైంది. జీజీయూ కులపతి కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు) అధ్యక్షతన జరిగిన ప్రారంభోత్సవసభలో ముఖ్య అతిథిగా హాజరైన శ్రీవాత్సవ్ మాట్లాడుతూ జీజీయూ అనుసంధానంతో విద్య జీఐఎస్ కార్యక్రమాన్ని త్వరలో ప్రారంభించేందుకు చేయూతనిస్తా మన్నారు. మరో అతిథి ఐపీ అండ్ టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ ఇన్నోవేషన్‌సెల్, (ఏఐసీటీఈ) మేనేజర్ ఐఎస్ భీమలింగారెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో బాల్య దశ నుంచి సృజనాత్మకతను పెం పొందించే దిశగా పాఠశాల ఉపాధ్యాయులకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు రెండు దశల్లో శిక్షణ జరిపామని, ప్రస్తుతం మూడో దశ శిక్షణా కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. వాద్వానీ ఫౌండేషన్ ప్రతినిధి విశాల్ నాయర్ మాట్లాడుతూ దేశంలోని మారుమూల ప్రాంతాల్లోని విద్యార్థులకు ఉపాధ్యాయుల ద్వారా శిక్షణ అందించడం తమ ఫౌండేషన్ ముఖ్యోద్దేశ్యమన్నారు. బూట్ క్యాంప్ నోడల్ అధికారి టి.జయానందకుమార్ మాట్లాడుతూ 2 రోజుల పాటు జరిగే ఈ శిక్షణ కార్యక్రమానికి తెలుగు రాష్ట్రాలతో పాటుగా మహారాష్ట్ర, చత్తీష్‌ఘడ్, ఒరిస్సా, తమిళనాడు రాష్ట్రాల నుంచి 271 మంది ఉపాధ్యాయులు హాజరైనట్టు చెప్పారు. కార్యక్రమంలో జీజీయూ వీసీ యు.చంద్రశేఖర్, డైరెక్టర్ శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ పీఎంఎంఎస్ శర్మ, దండమూడి విజేంద్రకుమార్, కె.వినోద్‌వర్మ, పాల్గొన్నారు.

ఆలయం... అద్భుతం!

కాకినాడ జిల్లా సామర్లకోటలో కుమారరామ భీమేశ్వరాలయం వద్ద శుక్రవారం రాత్రి ఆలయ శిఖర భాగాన ఉన్న పసిడి కుండలను ముద్దాడేందుకు చందమామ వస్తుందా అనే రీతిలో కనిపించింది. ఈ అద్భుతమైన దృశ్యాన్ని ఆంధ్రజ్యోతి కెమెరా క్లిక్ మనిపించింది. -సామర్లకోట



ప్రభుత్వాసుపత్రిని ప్రక్షాళన చేస్తున్నాం

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు


సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ప్రక్షాళణ చేస్తున్నామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో రూ.2 లక్షల సీఎం సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలనేది సీఎం చంద్రబాబు సంకల్పమని, అందుకే వైద్యానికి అత్యధిక ప్రాధాన్యమిస్తున్నారని చెప్పారు. ఇందులో భాగంగానే రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో సదుపాయాలు మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నామన్నారు. గత వైసీపీ పాలన మాదిరి నిర్లక్ష్యంగా ఉంటామంటే కుదరదని హెచ్చరించారు. రాష్ట్రంలో ఎన్టీఆర్ వైద్యసేవల ద్వారా ప్రజలకు ఉచితంగా వైద్యం అందిస్తున్నామన్నారు. ఇంకా సీఎంఆర్ఎఫ్ నుంచి రూ.60 లక్షలు పెండింగ్‌లో వుందని త్వరలో వాటిని కూడా లబ్ధిదారులకు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

టీడీపీకి కార్యకర్తలే మూలస్తంభాలు: గోరంట్ల


సభ్యత్వ నమోదు కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోరంట్ల

కడియం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): టీడీపీకి కార్యకర్తలే మూలస్తంభాలని, వారి భవిష్యత్తుకు అండగా సభ్యత్వ నమోదు ఉంటుందని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. వేమగిరితోటలో నిర్వహించిన టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ పార్టీ సభ్యత్వ నమోదు రెండేళ్లకోసారి నిర్వహిస్తామన్నారు. నియోజకవర్గంలో గతంలో సభ్యత్వం తీసుకున్న పలువురికి ప్రమాదబీమా అందించామన్నారు. పార్టీ సభ్యత్వ నమోదు వాట్సాప్, టీడీపీ యాప్, టెలిగ్రామ్ ద్వారా పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వెలుగుబం టి ప్రసాద్, టీడీపీ మండలాధ్యక్షుడు వెలుగుబంటి నాని, చెల్లుబోయిన శ్రీను, వాసిరెడ్డి రాంబాబు, గుత్తుల కృష్ణ, పితాని శివరామకృష్ణ, వాశంశెట్టి నాగబాబు, దంగేటి సత్తిబాబు, యనమదల రాజు పాల్గొన్నారు.

కాండం తొలుచు పురుగు నివారణకు చర్యలు

రంగంపేట,నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వరిలో కొనలు తుంచడం ద్వారా కాండం తొలుచు పురుగు ఉధృతిని తగ్గించవచ్చునని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు చల్లా వెంకటనరసింహరావు, మానుకొండ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం రాజమహేంద్రవరం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు ఆధ్వర్యంలో నైరా వ్యవసాయ కళాశాల విద్యార్థులు దాళ్వాలో వరినాట్లు వేసేటప్పుడు కొనలు తుంచడం వల్ల ఉపయోగాలను రంగంపేటలో రైతులకు వివరించారు. విద్యార్థినులు మాట్లాడుతూ కాండం తొలుచు పురుగు గుడ్లను వరి ఆకు కొనలపై పెడుతుందని, గుడ్ల నుంచి లార్వా కాండంలోకి ప్రవేశించి మొవ్వు తొలిచి కుళ్లిపోయేలా చేస్తుందని, దీని వల్ల మొక్క వడిలిపోయి చనిపోతుందన్నారు. వరినాట్లు వేసేటప్పుడు కొనలను తుంచి నాటుకుంటే 75శాతం మేర పురుగుల బెడద నాట్ల దశలోనే పోతుందన్నారు. అనంతరం నారు వేళ్లను క్లోరిపైరిఫాస్ 2.0 మి.లీ.నీటికి కలిపిన ద్రావణంలో ముంచి, నాటుకొనే విధానాన్ని ప్రదర్శన ద్వారా రైతులకు వివరించారు. కార్యక్రమంలో రైతులు పోతుల పద్మారావు,పెండ్యాల బుజ్జిబాబు, చేవ శ్రీనివాస్, జుజ్జువరపు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అస్సాగో బాధితులకు న్యాయం జరగకపోతే

‘డిసెంబరు 3నుంచి ఉద్యమం’

గోకవరం, నవంబరు 29: (ఆంధ్రజ్యోతి): గుమ్మళ్ళదొడ్డి గ్రామ సమపంలో ఏర్పాటుచేసిన అస్సాగో ఇథనాల్ పరిశ్రమ నుంచి బాధితులకు సరైన న్యాయం జరకపోతే డిసెంబరు 3వ తేదీ నుంచి ఉద్యమానికి శ్రీకారం చుడతామని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మరోతి శివగణేష్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన సామాజిక మాధ్యమం ద్వారా ఈ విషయాన్ని వెల్లడించారు. వచ్చే నెల 2వ తేదీ నాటికి నిజనిర్ధారణ కమిటీ నివేదికను బహిరంగ పరిచి, బాధితుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. లేకుంటే వచ్చే నెల 3నుంచి గుమ్మళ్లదొడ్డి, అచ్యుతాపురం, బావాజీపేట, వెదురుపాక తదితర గ్రామాల ప్రజల మద్దతుతో ఉద్యమం చేపడతామని పేర్కొన్నారు.

ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాలు ఎక్కువ జరగాలి


పాలచర్ల పీహెచ్‌సీలో సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

దివాన్‌చెరువు, నవంబరు29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాలు ఎక్కువగా జరిగేలా చూడాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు సూచించారు. రాజానగరం మండలం పాలచర్లలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. హెచ్‌ఎంఐఎస్, ఈహెచ్‌ఆర్ తదితర రికార్డులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఆసుపత్రిలో అవుట్‌పేషెంట్లతో బాటు ఐపీ సంఖ్య కుడా పెరగవలసి ఉందని చెప్పారు. ఆయా గ్రామ సచివాలయాల జనాభాకు తగ్గట్టుగా ఐయూడీలు ఉండాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్లు బెనడిక్ట్, శ్రీరాణి, డీఎంహెచ్‌వో కార్యాలయ డాక్టర్లు షమ్మీకుమార్, నిశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నియంత్రణపై విస్తృత అవగాహన

పాలచర్ల పీహెచ్‌సీ తనిఖీలో డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ వ్యాధి నియంత్రణపై ప్రజల్లో విస్తృతమైన అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం రాజమహేంద్రవరంలోని గోకవరం బస్టాండు ఆవరణలో వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఐఈసీ మెటీరియల్‌తో కూడిన అవగాహన స్టాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి నియంత్రణ లక్ష్యంగా వైద్య, ఆరోగ్యశాఖ ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ వసుంధర మాట్లాడారు. జిల్లా న్యూక్లియస్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మానస, నారీ సాక్ష్యం, వైఆర్‌జీ కేర్ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నిధుల కేటాయింపుపై హర్షం

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ప్రజలు చిరకాల ఆకాంక్షైన హేవ్‌లాక్ బ్రిడ్జి సుందరీకరణకు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించడం హర్షనీయమని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ శనివారం ఓ ప్రకటనలో అన్నారు. సుమారు 127 ఏళ్ల క్రితం నిర్మించిన బ్రిడ్జిని పాదచారులకు అనుగుణంగా, సుందరీకరణ చేయాలని నగరవాసులు చేసిన పోరాటాలు ఫలించాయన్నారు.

నేటి నుంచి అద్వైతామృత వర్షిణి-

భగవద్గీతపై ప్రవచనాలు

బిక్కవోలు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): బలభద్రపురంలోని ఎంఎస్ఆర్ ఫంక్షన్ హాలులో ట్రూత్ స్పిరిట్యువల్ ఆర్గనేషన్ ఆధ్వర్యంలో అద్వైతామృత వర్షిణి- భగవద్గీతపై ప్రవచనాలను బోధిస్తున్నట్లు ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు శ్రీవివేకానంద శుక్రవారం తెలిపారు. ప్రవచనాలతో పాటు ఇతర కార్యక్రమాలను ఈనెల 30 నుంచి డిసెంబరు 6 వరకూ నిర్వహిస్తామన్నారు. దేశ విదేశాల నుంచి సాధకులు హాజరవుతారని ఆయన తెలిపారు.

రాష్ట్రాన్ని అగ్రభాగాన నిలిపేది

సీఎం చంద్రబాబే

మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి



రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జగన్ అవగాహన లేని పాలనతో రాష్ట్రం భ్రష్టుపట్టిపోయిందని, ఇప్పుడు వ్యూహాత్మకంగా సీఎం చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం ఏపీని అగ్రభాగాన నిలబెట్టేందుకు కృషి చేస్తోందని మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు శనివారం ఓ ప్రకటనలో అన్నారు. చేయాల్సిందల్లా చేసి ఇప్పుడు జగన్ సన్మానాలు, అవార్డులు కోరుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం స్వర్ణాంధ్ర విజన్ 2047 డాక్యుమెంట్‌కు శ్రీకారం చుట్టిందన్నారు.

పర్యావరణ పరిరక్షణ

అందరి బాధ్యత

రాజమహేంద్రవరం రూరల్ నవంబరు 29(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని వ్యవసాయ కళాశాల డీన్ డాక్టర్ డి.శ్రీనివాస్ అన్నారు. వన మహోత్సవంలో భాగంగా రాజవోలు గ్రామంలో ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం కళాశాల విద్యార్థులు నిర్వహించిన ఎన్ఎస్ఎస్ ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఎన్ఎస్ఎస్ పీవో సీహెచ్ సునీత ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. శ్రీనివాస్, వ్యవసాయాధికారి భీమరాజులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మొక్కలు నాటడంతో పాటు వాటి పరిరక్షణకు బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి డాక్టర్ వెంకట్రావు, నిమ్మలపూడి రామకృష్ణ, వాకలపూడి సత్యనారాయణ, ముత్యాల రామారావు, శ్రీనివాస రెడ్డి, ప్రొఫెసర్లు దక్షిణామూర్తి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

వన సంరక్షణకు

ప్రతీఒక్కరు మొక్కలు నాటాలి

అనపర్తి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వన సంరక్షణ కోసం ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని అనపర్తి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఇన్‌చార్జి న్యాయమూర్తి రెడ్డి ప్రసన్న అన్నారు. శుక్రవారం కార్తీక మాసం సందర్భంగా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టు ఆవర ణలో మొక్కలు నాటే కార్యక్రమంలో ఆమె పాల్గొని ఉసిరి మొక్కను నాటారు. ఈ సందరభంగా మాట్లాడుతూ కార్తీక మాసం అనేక విశిష్టతలను తెలుపుతుందని ముఖ్యంగా వన సరంక్షణ కోసం ఏర్పడిన మాసమని అన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు, బార్ అసోసియేషన్ ప్రతినిధులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ సలహాదారుడు

షరీఫ్‌ను కలిసిన సుభాన్



రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడిగా బాధ్యతలు స్వీకరించిన జనాబ్ ఎంఏ షరీఫ్‌ను ఏపీ టీడీపీ నూర్ బాషా సాధికార సమితి కన్వీనర్ షేక్ సుభాన్ మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ మేరకు రాజమహేంద్రవరంలో శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. షరీఫ్‌ను కలిసిన వారిలో ఆయుర్వేద వైద్యుడు జమాల్ ఖాన్, టీడీపీ నాయకులు సల్మాన్, మౌలానా,ఇబ్రహీం తదితరులున్నారు.

విప్లవకారుల త్యాగాలను వృథాకానివ్వం

అమరవీరుల సంస్మరణలో రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి కర్నాకుల


సంస్మరణ సభలో మాట్లాడుతున్న కర్నాకుల వీరాంజనేయులు

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): పాలకులు నిరంకుశ విధానాలను ప్రతిఘటిస్తూ ప్రాణాలర్పించిన విప్లవకారుల త్యాగాలను వృధాకానివ్వబోమని రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు అన్నారు. క్రామేడ్ చంద్ర పుల్లారెడ్డి 40వ వర్ధంతి సందర్భంగా రాజమహేంద్రవరం కార్పొరేషన్ కార్యాలయ సమీపంలోని అంబేడ్కర్ భవన్‌లో శుక్రవారం పీడీఎస్‌యూ విజృంభన జిల్లా కార్యదర్శి శ్రీకాంత్ అధ్యక్షతన జరిగిన అమరవీరుల సంస్మరణ సభలో కర్నాకుల మాట్లాడుతూ భూమి కోసం, భుక్తికోసం పీడిత ప్రజల విముక్తికోసం పోరాడిన వారి త్యాగాలను వృథాకానివ్వబోమన్నారు. కార్పొరేట్ శక్తులకు పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నిరంతరం పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం నాయకులు కొండ దుర్గారావు, బి.రమేష్, మడికి సత్యం, డి.సురేష్, పీడీఎస్‌యూ నాయకుడు కడితి సతీష్, మహిళా సంఘం నాయకురాలు నిరీక్షణ, డాన్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

అవగాహనా సదస్సులో సీఐ సుమంత్


సదస్సులో మాట్లాడుతున్న సీఐ సుమంత్

అనపర్తి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రోజురోజుకు పెరుగుతున్న సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ సుమంత్ అన్నారు. శుక్రవారం కొప్పవరంలో నిర్వహించిన సైబర్ నేరాలపై అవగాహనా సదస్సులో ఆయన ప్రసంగించారు. సైబర్ నేరగాళ్లు నిమిషాల వ్యవధిలో బ్యాంక్ ఖాతాల్లో ఉన్న సొమ్మును తస్కరిస్తున్నారని, సోషల్ మీడియాలో వస్తున్న లింక్‌లను తెలుసుకోకుండా ఓపెన్ చేయవద్దని సూచించారు. ఇటీవల కాలంలో సైబర్ నేరాలు కొత్త పుంతలు తొక్కుతున్నాయని ఓఎల్ఎక్స్, సోషల్ మీడియా, ఎంప్లాయిమెంట్, లోన్‌యాప్, ఫేక్ పోలీస్, ఏటీఎం, క్రెడిట్ కార్డు వంటి వాటిల్లో నేరాల సంఖ్య పెరిగిందన్నారు. నేరం జరిగిన వెంటనే చేపట్టాల్సిన అంశాలపై సీఐ ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీను నాయక్, టీడీపీ నాయకుడు కర్రి వెంకటరామారెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రాజానగరంలో కార్తీక దీపోత్సవం


కార్తీక దీపాలు వెలిగించిన దృశ్యం

రాజానగరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : రాజానగరం గ్రామ దేవత శ్రీముత్యాలమ్మ ఆలయంవద్ద కార్తీకమాసం ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా శుక్రవారం ఆలయ ప్రాంగ ణంలో రంగవ ల్లులను తీర్చిదిద్దారు. అమ్మవారి రూపంతో పాటు శివ లింగం, త్రిశూలం, ఓంకారం, స్వస్తిక్, శంఖు, చక్రాలు కార్తీక దీపాల కాంతులతో దేదీప్యమానంగా దర్శనమిచ్చాయి. అలాగే అమ్మవారికి 108 తామర పుష్పాలను మహిళా భక్తులు అర్పించారు. ఆలయ నిర్వాహకులు కర్రి సత్తిబాబు, భక్తులు నీలపాల సుబ్రహ్మణ్యం, సుభద్ర దంపతులు సేవలందించారు.

బాల్యం నుంచే ఆధ్యాత్మిక చింతన అలవర్చాలి

● విధుశేఖర భారతీ స్వామి


విరించి వానప్రస్థాశ్రమాన్ని సందర్శించిన విధుశేఖర భారతీ మహాస్వామి

రాజమహేంద్రవరం కల్చరల్, నవంబరు29(ఆంధ్రజ్యోతి): బాల్యం నుంచే ఆధ్యాత్మిక చింతన అలవర్చాలని, శ్రీశృంగేరీ జగద్గురువులు శ్రీ విధుశేఖర భారతీ మహాస్వామి ఉద్బోధించారు. ఎన్ని పనులున్నా సరే, ప్రతీఒక్కరూ దైవచింతనకు సమయం కేటాయించుకోవాలన్నారు. ధర్మవిజయయాత్రలో భాగంగా రాజమండ్రిలో విడిది చేసిన ఆయన శుక్రవారం స్థానిక శ్రీరాంనగర్‌లోని శ్రీవిరించి వానప్రస్థాశ్రమనం సందర్శించారు. ఆశ్రమం తరపున విశ్వనాథం భాస్కరరామ్ దంపతులు, డాక్టర్ టీవీ నారాయణరావు దంపతులు, మద్దూరి శివ సుబ్బారావు, మద్దూరి శివరామ శశిభూషన్, తదితర కార్యవర్గం పూర్ణకుంభంలో వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గురువందన సభ ఏర్పాటైంది. శ్రీ విరించి వానప్రస్థాశ్రమం, శ్రీ గౌతమీ నేత్రాలయం సంయుక్త ఆధ్వర్యాన శ్రీ శృంగేరీ శారదా పీఠం అడ్మినిస్ట్రేటర్ పీఏ మురళికి గౌరవ సత్కారం నిర్వహి ంచారు. ఆశ్రమం గురించి మహామహోపాధ్యాయ విశ్వనాధ గోపాలకృష్ణ శాస్త్రి వివరించారు. అనంతరం శ్రీ జగద్గురువులు శ్రీ విధుశేఖర భారతీ మహాస్వామి అనుగ్రహ భాషణం చేస్తూ పిల్లల అంధత్వ నివారణ, ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ అందరూ ఆధ్యాత్మిక చింతన అలవరచుకోవాలని అన్నారు. ఉపదేశం కోసం గురువు లేడని భావించకుండా, సాక్షాత్తూ కృష్ణ పరమాత్మ అర్జునిడికి ఉపదేశించిన భగవద్గీతను చదివించాలన్నారు. కార్యవర్గంతోపాటు దోర్బల ప్రభాకరశర్మ, పి.శ్రీనివాస్, వాడ్రేవు మల్లపరాజు, నూజిళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం శ్రీ విధుశేఖర భారతీ మహాస్వామి దువ్వూరి రామకృష్ణారావు సభా మండపంలో గౌతమీ నేత్రాలయం చైర్మన్ డాక్టర్ వీకే రాజు ఆధ్వర్యాన ప్రారంభమైన మహా పాశుపతి రుద్రహోమం పూర్ణాహుతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గౌతమీ నేత్రాలయం ఎండీ వీవీ కుమార్, సీఎంవో డాక్టర్ శ్రీనివాసరెడ్డి, పీఆర్‌వో పి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన హరిహర క్షేత్రం


అనంతేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల

కడియం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రతీఒక్కరూ ఆధ్యాత్మికత, దైవభక్తి వంటివి ఎంతో అవసరం ఉందని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. అనంతేశ్వరస్వామి ఆలయం వద్ద శుక్రవారం ప్రత్యేకపూజా కార్యక్రమాలు జరిగాయి. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన అన్నసమారాధనకు వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. అనంతేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయ సమీపంలో జాతీయ రహదారిపై ఎటువంటి సంఘటనలు జరగకుండా సీఐ ఎ.వెంకటేశ్వరావు నేతృత్వంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయకమిటీ సభ్యులు, కూటమి నాయకులు, నర్సరీ రైతులు పాల్గొన్నారు.

సారా స్థావరాలపై దాడి

రంగంపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రంగంపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గల వడిశలేరులో శుక్రవారం నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించి 5 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొని కండిపిల్లి దుర్గాదేవిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్.ఐ దుర్గాప్రసాద్ తెలిపారు. ఈ దాడులలో సిబ్బంది పాల్గొన్నారన్నారు.

లక్ష కుంకుమార్చన, పూర్ణాహుతి

రాజమహేంద్రవరం కల్చరల్, నవంబర్ 29(ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసంలో ప్రతీనెలా నిర్వహించే మాసశివరాత్రి లక్ష బిల్వార్చన కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం స్థానిక గోదావరిగట్టున గల శ్రీ కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి మందిరం నందు శుక్రవారం వివేకానంద సనాతన ధర్మప్రచార సమితి ట్రస్ట్ నిర్వహణలో పురోహితులు బ్రహ్మశ్రీ తొయ్యేటి సీతారామశర్మ ఆధ్వర్యంలో చలంచర్ల వెంకట రత్నాజీ దంపతులచే గణపతి పూజతో ప్రారంభమై గోదావరినది పూజ, గోపూజ, మహాన్యాసము, నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు కాకి నాగేశ్వరరావు అండ్ బ్రదర్స్, నగర ప్రముఖులు ఆకుల వీర్రాజు, అశోక్‌కుమార్‌జైన్, బి.సుబ్బారాయుడు, నందెపు శ్రీనివాస్, కోళ్ళ అచ్యుత రామారావు పాల్గొన్నారు.

భారీ వనసమారాధన

గోకవరం, నవంబరు29(ఆంధ్రజ్యోతి): గోకవరం-రంపయర్రంపాలెం రహదారి మధ్యలో ఉన్న మామిడితోటలో శుక్రవారం నాయీ బ్రాహ్మణుల సంఘం ఆధ్వర్యంలో భారీ వన సమారాధన జరిగింది. ఈ వన సమారాధనకు మండలంలోని నాయీ బ్రాహ్మణుల కుటుంబ సభ్యులు, వివిధ రాజకీయపార్టీల నాయకులు, ఇతరులు భారీ సంఖ్యలో హజరయ్యారు. సుమారు 15రకాల పదార్థాలను నిర్వాహకులు భక్తులకు ప్రసాదంగా అందించారు. వనసమారాధనతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం వరకు ఉల్లాసంగా గడిపారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు హాజరయ్యారు. సుమారు 5వేలమంది పాల్గొని అన్నప్రసాదాలను స్వీకరించారు.

‘గోదావరి పుష్కరాలను సజావుగా నిర్వహించాలి’


డిమాండ్ల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సానబోయిన రామారావు

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గోదావరి పుష్కరాల 2027 ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సజావుగా నిర్వహించాలనే ఆలోచనతో బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ సంఘం రూపొందించిన కరపత్రాన్ని రాజమహేంద్రవరంలో ఆవిష్కరించారు. శనివారం రాజమహేంద్రవరంలో జరిగిన సమావేశంలో సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు సానబోయిన రామారావు మాట్లాడుతూ గత పుష్కరాలకు జరిగిన ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని తమ సంఘం కొన్ని డిమాండ్‌లతో కరపత్రాన్ని తయారు చేసిందన్నారు. దీనిని ప్రభుత్వం పరిగణంలోకి తీసుకోవాలన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులకు కీలక బాధ్యతలు అప్పగించాలన్నారు. రాజమహేంద్రవరం, రూరల్, రాజానగరం, కొవ్వూరు, నిడదవోలు నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, మంత్రి దుర్గేష్‌తో సమన్వయం ఏర్పరచాలని, ముఖ్యంగా అత్యంత కీలకమయ్యే రాజమహేంద్రవరం, రూ రల్ ఎమ్మెల్యేలకు కేబినెట్ హోదాలో పుష్కరాల బాధ్యతలు అప్పగించాలన్నారు. కళ్యాణ మండపాలు, కమ్యూనిహాళ్లు సిద్ధంచేయాలని, ఇతర పనులకు అప్పగించిన వాటిని ఖాళీ చేయించాలని, ముఖ్యంగా గోదావరిలో డ్రైనేజీ వాటర్ కలవడాన్ని అరికట్టాలని, పుష్కరాలకు 10కోట్ల మంది భక్తులు వచ్చే అవకాశాలు ఉన్నందున వచ్చిన బం ధువులకు అతిథులకు అతిథ్యం ఇచ్చే ందుకుగాని బీసీ, ఎస్సీ కుటుంబాలకు రూ.20వేలు సాయంగాని, నిత్యావసరాలు అందించడంగాని చేయాలనే 6డిమాండ్‌లను తయారు చేశామని కూటమి ప్రభుత్వం పరిగణంలోకి తీసుకుని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సంఘం వైస్‌చైర్మన్ ఎల్‌వీ ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు ఆంటోని, జిల్లా ప్రధాన కార్యదర్శి గొర్సా తాతబ్బాయి యాదవ్, ఆర్. నాగేశ్వరరావు, గుత్తుల సుబ్రహ్మణ్యం, బత్తిన ఏడుకొండలు, మట్టపర్తి సత్యనారాయణ, బొక్కా సత్యవెంకట ప్రతాప్, లాజర్‌లు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

● పంట పొలాలను పరిశీలించిన ఎమ్మెల్యే నల్లమిల్లి


రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

అనపర్తి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కోస్తాపై తుపాన్ ప్రభావం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరిస్తున్న సమయంలో రైతులు అప్ర మత్తంగా ఉండాలని ఇప్పటికే కోతలు పూర్తయిన ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించుకోవాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి రైతులకు సూచించారు. తుపాను నేపథ్యంలో ఎమ్మెల్యే శుక్రవారం నియోజకవర్గంలో అనపర్తి, పెదపూడి, బిక్కవోలు మండలాల్లో మసూళ్లు జరుగుతున్న పలు ప్రాంతాలలో పర్యటించి రైతులకు సూచనలు చేశారు. నియోజకవర్గంలో ఇప్పటికే 90శాతం వరకు మాసూళ్లు పూర్తయ్యాయని ఇప్పటివరకు ఎన్ని తుఫాన్‌లు వచ్చినా రైతులు ఇబ్బం దిపడే పరిస్థితి రాకపోవడం అదృష్టమన్నారు. మాసూళ్ల చివరి దశలో ఉండగా మరో తుఫాన్ ముప్పు రానుందని దీనిపై రైతులు జాగ్రత్త వహించాలని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పలుచోట్ల రైతులతో ముచ్చటిస్తూ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతు సమస్యలను పరిగణలోకి తీసు కుని పరిష్కార దిశగా కృషి చేస్తుందన్నారు. వచ్చే వేసవిలో కాలువల్లో పూడికతీత పనులు చేపట్టి సాగునీటికి ఇబ్బంది లేకుండా చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు.

విజయవంతంగా ఇంటింటి ఆరోగ్య పరీక్షలు

● డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ సంధ్య

నల్లజర్ల, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఇంటింటి ఆరోగ్య పరీక్షలు విజయవంతంగా జరుగుతున్నాయని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ సంధ్య, డీసీహెచ్ఎస్‌వో వసంతలక్ష్మి అన్నారు. శుక్రవారం మండలంలోని జగన్నాథపురం, నల్లజర్ల గ్రామాల్లో వారు పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం తాజాగా చేపట్టిన ఎన్‌సీడీ 3.0 కార్యక్రమంలో భాగంగా ప్రజలకు షుగర్, బీపీ, హిమోగ్లోబిన్, క్యాన్సర్ వంటి వ్యాధులకు వైద్య పరీక్షలు చేస్తున్నామన్నారు. ప్రజలకు ఆరోగ్యంపై అవగాహనతోపాటు ఇంటింటి సర్వే చేసి ప్రతి ఇంటిలో ఏ వ్యాధులు ఉన్నాయో గుర్తించి వాటి నివారణకు తగిన ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నామన్నారు. 18 ఏళ్లు దాటిన ప్రతిఒక్కరికి ఆరోగ్య పరీక్షలు చేసి వ్యాధుల నిర్ధారణ చేసి వాటిని ఆన్‌లైన్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ తెల్లం గంగాధర్, డాక్టర్ మహ్మద్ సిరాజుద్దీన్, జీవీవీ ప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జనవరి 18 నుంచి సాధు పరిషత్ మహాసభలు

దేవరపల్లి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): అఖిలాంధ్ర సాధుపరిషత్ 60వ మహాసభలు జనవరి 18నుంచి 21వ తేదీ వరకు దేవరపల్లిలో నిర్వహించనున్నట్టు సాధు పరిషత్ అధ్యక్షురాలు పరా విద్యానందగిరి స్వామిని అన్నారు. దేవర పల్లిలో కరుటూరి ఫంక్షన్‌హాలులో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ అఖిలాంధ్ర సాధుపరిషత్ 1965లో ఏర్పాటైందని ఇప్పటి వరకు దేశంలోని వివిధ ప్రాంతాల్లో 59 మహాసభలు నిర్వహించామని, 60వ సభ దేవరపల్లిలో నిర్వహిస్తున్నామన్నారు. ప్రజల్లో ఆధ్యాత్మి కత, సంస్కృతి, సంప్రదాయాలు, ప్రేమానురాగాలు, భక్తిధోరణి, మానవత విలువలు పెంపొందించడం ఈ సభల ముఖ్య ఉద్దేశమన్నారు. దేశంలోని వివిధ పీఠాధిపతులు, సాధుపుంగవులు ఆధ్యాత్మిక ప్రసంగాలు చేస్తారన్నారు. మూడేళ్లకోసారి జరిగే పరిషత్ నూతన కార్యవర్గం ఏర్పాటు జనవరిలో దేవరపల్లిలో జరుగుతుందన్నారు. ఈ సభలకు దేశంలోని 300మంది వివిధ ప్రాంతాల నుంచి సాధువులు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో సాధుపరిషత్ ఉపాధ్యక్షుడు పరమాత్మ ఆనంద గిరి స్వామి, జగదీశ్వరనందగిరి స్వామి, సూర్య భాస్కర్ స్వామి, సరస్వతి స్వామి, శ్రీకృష్ణానంద బ్రహ్మచారి, త్యాగదయానందగిరిస్వామి, బాలాజీ స్వామి, స్థానికులు పాల్గొన్నారు.

రైతు గుండెల్లో 'తుఫాన్'

- కళ్లాల్లో 40 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం
- అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన


కుప్ప వేసుకుంటున్న రైతులు

రాజమహేంద్రవరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రైతుల్లో తుఫాన్ ఆందోళన నెలకొంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో రెండు మూడ్రోజులు ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు వాతావరణ కేంద్ర హెచ్చరికలతో రైతులు హడలిపోతున్నారు. ప్రస్తుతం పొలాలు, జాతీయ రహదార్లు, రోడ్లు, ఇతర ప్రాంతాల్లోని కళ్లాల్లో 40 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం రాశులు ఉన్నాయి. వాటిని వెంటనే తరలించకపోతే వర్షం వల్ల ఇబ్బంది తప్పదని రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో మొత్తం 72 వేల 246 హెక్టార్లలో వరి పంట సాగుచేశారు. అందులో ఇప్ప టివరకు 46వేల 007 హెక్టార్లలో వరికోతలు పూర్తయ్యాయి. ఇవి 65 శాతం. వీటి ద్వారా 3 లక్షల 11వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చింది. అందులో పౌరసరఫరాల శాఖ ద్వారా లక్షా 49వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు. రైతులు సుమారు 60 వేల టన్నుల ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాల్లో దాచిపెట్టుకున్నారు. కళ్లాల్లో ఇంకా 40 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉంది. ఒపెన్ మార్కెట్‌లో సుమారు 25 వేల టన్నుల ధాన్యం అమ్మారు.

వర్షం వస్తే కోతలు ఆపాలి

తుఫాన్ ప్రభావం వల్ల వర్షాలు వస్తే ప్రస్తుతం వరికోతలు ఆపేయాలని, సమస్య లేకపోతే కోతలు కోసుకోవచ్చని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు తెలిపారు. వాతావరణ మార్పుల వల్ల రైతులు వెంటనే అప్రమత్తమై ధాన్యాన్ని వెంటనే కొనుగోలు కేంద్రాలకు తరలించాలన్నారు. ఎక్కడైనా యంత్రాలతో కోసిన పచ్చి ధాన్యం ఉంటే బాయిల్డ్ మిల్లులకు తరలించాలని కోరారు..

నిలదీసి.. నిగ్గదీసి..


బియ్యం నమూనాలను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం పవన్, మంత్రి నాదెండ్ల, ఎమ్మెల్యే కొండబాబు

- కాకినాడ పోర్టులో రేషన్ మాఫియాపై పవన్ శివాలు
- యథేచ్ఛగా బియ్యం తరలిపోతుంటే అంతా ఏం చేస్తున్నారంటూ నిప్పులు
- డీఎస్‌వో, కలెక్టర్, ఎస్పీ, డీఎస్పీ, పోర్టు అధికారులపై తీవ్ర ఆగ్రహం
- తానొచ్చినప్పుడల్లా జిల్లా ఎస్పీ సెలవుపై వెళ్లడమేంటని మండిపాటు
- ప్రతిసారి ఎమ్మెల్యేలు, మంత్రులువస్తేగానీ బియ్యం అక్రమ రవాణా ఆగదా అని నిప్పులు
- పవన్ ప్రశ్నలు, నిలదీతలతో హడలిపోయిన అధికారులు.. బియ్యం మాఫియాకు షాక్
- అటు సముద్రం అల్లకల్లోలంగా ఉన్నా సాహసించి తొమ్మిది నాటికల్ మైళ్ల ప్రయాణం
- రెండు నెలలుగా తనను తనిఖీలకు రాకుండా అడ్డుకుంటున్నారని సంచలన వ్యాఖ్యలు
- పశ్చిమ ఆఫ్రికాకు వెళ్లే నౌకను సీజ్ చేయాలని ఆదేశాలు : ఎస్పీకి నోటీసులు


మీడియాతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం పవన్. పక్కన మంత్రి నాదెండ్ల, ఎమ్మెల్యే కొండబాబు, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్

(కాకినాడ/కలెక్టరేట్ - ఆంధ్రజ్యోతి)

కాకినాడ నుంచి యథేచ్ఛగా రేషన్ బియ్యం విదేశాలకు తరలిపోతున్న వైనంపై డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ నిప్పులు చెరిగారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా అధికారులు పద్ధతి మార్చుకోకుండా మాఫియాకు సహకరిస్తున్నారంటూ ధ్వజమెత్తారు. రేషన్ బియ్యం విదేశాలకు తరలిపోయేలా అధికారులే సహకరిస్తున్నారంటూ శివాలెత్తారు. డీఎస్‌వో, కలెక్టర్, పోర్టు అధికారులను పిలిచి ఏం చేస్తున్నారు మీరంతా అంటూ మండిపడ్డారు. కాకినాడ జిల్లా ఎస్పీకి ఎన్నిసార్లు చెప్పినా కనీసం స్పందన లేదని దునుమాడారు. తాను జిల్లాకు ఎప్పుడు వచ్చినా సెలవుపై ఉంటున్నారు.. అంటూ ఆయనకు నోటీసులు పంపాలని ఆదేశించారు. కాకినాడ పోర్టు ప్రమాదకరంగా మారిందని, దీనిపై ప్రధాని, కేంద్ర హోంమంత్రికి లేఖ రాస్తానని హెచ్చరించారు.

యాంకరేజ్ పోర్టులో బియ్యం పరిశీలన

కాకినాడ పోర్టులో పవన్‌కల్యాణ్ శుక్రవారం మధ్యాహ్నం పర్యటించారు. తొలుత 12.45గంటలకు యాంకరేజ్ పోర్టులో బార్జిలో తనిఖీలు చేశారు. ఇందులో రేషన్ బియ్యం ఎగుమతి అవుతుండడంతో ఇటీవల అధికారులు పట్టుకున్నారు. నేరుగా పవన్ బార్జి ఎక్కి బియ్యం ప్లేటులో వేసి పరిశీలించారు. రేషన్ బియ్యం ఆనవాళ్లను గుర్తించారు. అక్కడే ఉన్న డీఎస్‌వో, కలెక్టర్, పోర్టు అధికారి, ఇతర అధికారులపై తీవ్రంగా మండిపడ్డారు. రేషన్ మాఫియాకు మీరంతా సహకరించకపోతే ఇలా ఎలా దేశాలు దాటిపోతోందని శివాలెత్తారు. ఉద్యోగాలు చేస్తున్నారా.. మాఫియాకు వంత పాడుతున్నారా? అంటూ మండిపడ్డారు. పక్కనే ఉన్న టీడీపీ ఎమ్మెల్యే కొండబాబును ఉద్దేశించి దీనిపై మరింత గట్టి పోరాటం చేయాలని, నెమ్మదిగా ఉండకూడదని పేర్కొన్నారు. అనంతరం అక్కడినుంచి మధ్యాహ్నం ఒంటి గంట తర్వాత డీప్‌వాటర్ పోర్టుకు చేరుకుని అక్కడి నుంచి టగ్ ఎక్కి సముద్రంలోకి వెళ్లారు.

సముద్రం అల్లకల్లోలంగా ఉన్నా..

తుఫాను నేపథ్యంలో సముద్రం అల్లకల్లోలంగా ఉండడంతో పవన్ సముద్రంలోకి వెళ్తారని అధికారులు అనుకోలేదు. కానీ అనూహ్యంగా ఆయన టగ్ ఎక్కి తొమ్మిది నాటికల్ మైళ్ల దూరంలో ఉన్న పశ్చిమ ఆఫ్రికా నౌక స్టెల్లా ఎల్ పనామా వద్దకు బయలుదేరారు. సముద్రం భయానకంగా ఉండడంతో అధికారులు వద్దని వారించారు. అయినా పవన్ వినలేదు. నౌకవద్దకు వెళ్లిన తర్వాత పైకి ఎక్కి ఎగుమతికి సిద్ధంగా ఉన్న 640 టన్నుల బియ్యాన్ని పరిశీలించాలి. కానీ వాతావరణం బాగోలేదని, నౌకపైకి ఎక్కొద్దని అధికారులు పవన్‌కు తెలిపారు. సముద్ర ప్రయాణం మధ్యలో పవన్ ఎమ్మెల్యే కొండబాబు సమక్షంలో అధికారులపై మండిపడ్డారు. రేషన్ మాఫియాపై ప్రభుత్వం సీరియస్‌గా ఉన్నా క్షేత్ర స్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయని అసహనం వ్యక్తంచేశారు. ఈ విషయంలో మొత్తం సివిల్ సప్లయిస్ డిపార్ట్‌మెంట్ ఫెయిల్ అయ్యిందన్నారు. డీఎస్‌ఓ ప్రసాద్, జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్, జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, పోర్టు అధికారి ధర్మ శాస్త్ర, డీఎస్పీ రఘువీర్‌పై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పీడీఎస్ బియ్యం ఉన్న స్టెల్లా ఎల్ పనామా భారీ నౌకను సీజ్ చేయాలని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశించారు. కాకినాడ యాంకరేజ్ పోర్టులో అధికారులు దృష్టిపెట్టాలన్నారు. పోర్టులోని రెండు చెక్‌పోస్టుల వద్ద 24 గంటలు నిఘా ఉండాలన్నారు.

కాకినాడలో రేషన్ మాఫియా

మధ్యాహ్నం 3 గంటల తర్వాత తిరిగి డీప్‌వాటర్ పోర్టుకు చేరుకున్న పవన్ విలేకరుల సమావేశంలో ప్రసంగించారు. రేషన్ మాఫియా కాకినాడలో దారుణంగా ఉందని, తనను నౌక ఎక్కనీయకుండా అధికారులు అడ్డుకున్నారని పేర్కొని సంచలన వ్యాఖ్యలు చేశారు. రెండు నెలలుగా కాకినాడ పోర్టులో తనిఖీలకు తనను రాకుండా అధికారులు ఏవో సాకులు చెప్పి అడ్డుకుంటున్నారని గుర్తుచేసి బాంబుపేల్చారు. తాను ఢిల్లీ నుంచి అమరావతి వెళ్లాలని, కానీ రేషన్ మాఫియా తీవ్రత నేపథ్యంలో కాకినాడ పర్యటనకు వచ్చానని తెలిపారు. విలేకరుల సమావేశం అనంతరం పవన్ అమరావతికి బయలుదేరి వెళ్లారు.

గ్రీన్‌ఛానల్ ద్వారా తరలింపు

అంతకుముందు మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ గత జూన్‌లో కాకినాడలో తనిఖీ చేసినప్పుడు 26వేల మెట్రిక్ టన్నులు పీడీఎస్ బియ్యం పట్టుకున్నామన్నారు. బియ్యం మాఫియా గుంటూరు, చిత్తూరు, శ్రీకాకుళం జిల్లా నుంచి గ్రీన్ ఛానల్ ఏర్పాటుచేసుకుని కాకినాడ పోర్టు నుంచి విదేశాలకు అక్రమంగా తరలిస్తున్నారన్నారు. పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు మాట్లాడుతూ అధికారంలో ఉన్నప్పుడు ద్వారంపూడే వ్యాపారం చేశారనీ, ఇప్పుడు బినామీలు ఈ దందా చేస్తున్నారని ఆరోపించారు.


బియ్యం పరిశీలిస్తూ...


డీఎస్పీ రఘువీర్‌ని ప్రశ్నిస్తున్న పవన్

నేడు పింఛన్ల పంపిణీ

రాజమహేంద్రవరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తిచేశామని కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. డిసెంబరు 1న ఆదివారం సెలవు దినం కావడంతో శనివారం పింఛన్లు ఇంటి వద్దకే తీసుకెళ్లి అందజేస్తామన్నారు. అలాగే మూడు నెలల పింఛను బకాయిలను కూడా ఇస్తామన్నారు. దీనికి జిల్లావ్యాప్తంగా 18 రూరల్, 3 పట్టణ మండలాల్లో 9,041 క్లస్టర్ల పరిధిలో 5,128 మంది సిబ్బందిని వినియోగిస్తున్నామని ఆమె చెప్పారు. మొత్తం 17 విభాగాల కింద 2,37,389 మందికి రూ.101 కోట్ల 63 లక్షల 33 వేలు పంపిణీ చేస్తామన్నారు. పింఛను లబ్ధిదారు మరణిస్తే జీవిత భాగస్వామికి ఆ పింఛను అందజేస్తామని తెలిపారు. ప్రామాణిక ఆపరేటింగ్ విధానంలో పింఛను మంజూరు పంపిణీ వ్యవస్థ అమలవుతోందని డీఆర్డీఏ పీడీ ఎస్‌వీవీఎస్ మూర్తి తెలిపారు. పింఛను లబ్ధిదారులు ఏ కార్యాలయానికి రావాల్సిన అవసరం లేదని, ప్రభుత్వ సిబ్బంది ఇంటికి తీసుకొచ్చి సగౌరవంగా పింఛను అందజేస్తారని తెలిపారు. ఏమైనా ఇబ్బందులు ఏర్పడినా వాటిని వెంటనే పరిష్కరించి పింఛను సొమ్ము ఇస్తామని తెలిపారు.


అనపర్తిలో మీడియాతో మాట్లాడుతున్న జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విశ్వేశ్వరరెడ్డి

అధికారంలోకి తేవడమే లక్ష్యం

జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి

అనపర్తి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడమే ధ్యేయంగా కార్యకర్తలు ముందుకుసాగాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. శుక్రవారం అనపర్తిలోని రైల్వే స్టేషన్ సమీపంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కన్వీనర్‌గా నియమితులైన సత్తి కృష్ణ చైతన్యరెడ్డి అధ్యక్షతన సమావేశం ఏర్పాటుచేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో, దేశంలో ప్రతిపక్ష పాత్ర వహిస్తున్నది కాంగ్రెస్ మాత్రమేనన్నారు. ప్రధానిగా రాహుల్‌ని, రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ షర్మిలారెడ్డిని చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. గత ఐదేళ్లలో వైఎస్ జగన్ రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారని, చివరకు అమెరికాలో కూడా రాష్ట్ర పరువును తీశారన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నిలబెట్టుకో వడంలో విఫలమైందన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించిన సత్తి కృష్ణచైతన్య రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మార్టిన్ లూథర్, రాజమహేంద్రి రూరల్ ఇన్‌చార్జి తాడాల కొండ్రాజు, జిల్లా మహిళా అధ్యక్షురాలు మోతా శారద తదితరులు పాల్గొన్నారు.

వర్క్ స్పేస్‌కు అనువైన భవనాలను గుర్తించండి

కలెక్టర్ ప్రశాంతి



రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : పొరుగు పనిస్టేషన్ల ఏర్పాటుకోసం అనువైన స్థలాన్ని, భవన సముదాయాలను గుర్తించడంపై రెవెన్యూ అధికారులు దృష్టి పెట్టాలని కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్‌లో జరిగిన వీడియోకాన్ఫరెన్స్‌ను జేసీ చిన్నరాముడు, డీఆర్‌వో టీ సీతారామమూర్తిలతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పనిచేసే ప్రదేశాల్లో, ప్రభుత్వ ప్రైవేటు భవనాల్లో సౌకర్యవంతంగా ఉండే వర్క్‌స్పేస్‌తో కూడిన ప్రాంతాలను గుర్తించి నివేదిక అందజేయాలని స్పష్టం చేశారు. ఇందులో భాగంగా అర్బన్ ప్రాంతంలో, సమీప మండలాల్లో, రూరల్ మండలల కేంద్రాలలో తగిన భవన సముదాయాలు లేదా వర్క్ ప్లేసెస్‌ను గుర్తించి నిర్ణీత పట్టికలో అందజేయాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వ భవనాలు, మహిళా సమాఖ్య, ఎంపీడీవో కార్యాలయాలు, సచివాలయ భవనాలు, ఇతర ప్రభుత్వ శాఖల భవనాలతోపాటు ప్రైవేట్ వ్యక్తుల భవనాలు కూడా గుర్తించాలని సూచించారు. పొరుగు పని స్టేషన్లలో 24 గంటల విద్యుత్ సరఫరా, హైస్పీడ్ ఇంటర్నెట్, కార్పొరేట్ ఆఫీసు వసతులు కల్పించడం ద్వారా వర్క్‌ఫ్రమ్ హోమ్ చేసుకునే సౌలభ్యం కల్పించడం ముఖ్య ఉద్దేశమన్నారు. కాన్ఫరెన్స్‌లో వర్చువల్ ద్వారా కమిషనర్ కేతన్‌గార్గ్, ఆర్డీవోలు ఆర్.కృష్ణనాయక్, రాణిసుస్మిత తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం గొడౌన్ పరిశీలించిన కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఎన్నికల కమిషనర్ మార్గదర్శకాల మేరకు ప్రతి నెలా ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ గొడౌన్‌లను తనిఖీ చేస్తున్నామని కలెక్టర్ ప్రశాంతి అన్నారు. శుక్రవారం రాజమహేంద్రవరం ఎఫ్‌సీఐ గొడౌన్‌లోని ఉన్న ఈవీఎం గొడౌన్‌ను జిల్లా కలెక్టర్, ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్‌లు పరిశీలించారు. ఈవీఎం బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాట్స్‌లు నిరంతరం సీసీ కెమేరాల పర్యవేక్షణలో స్ట్రాంగ్ రూమ్‌లో ఉంచడం జరిగిందని కలెక్టర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పీహెచ్‌జీఆర్ పాపారావు, రెవెన్యూ, భద్రత సిబ్బంది పాల్గొన్నారు.

సంక్రాంతి కానుకగా కొత్త రేషన్ కార్డులు

వచ్చే నెల 2 నుంచి దరఖాస్తుల స్వీకరణ.. విభజన, మార్పులు, చేర్పులకు అవకాశం.. ఐదేళ్ల నిరీక్షణకు తెరదించిన కూటమి ప్రభుత్వం

రాజానగరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు తెల్ల రేషన్‌కార్డు ప్రామాణికంగా మారింది. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, దీపం-2 పథకం వర్తించాలన్నా, వితంతువులు, విభిన్న ప్రతిభావంతులకు, వృద్ధులకు పింఛను మంజూరు చేయాలన్నా, ప్రాథమికంగా తెల్ల రేషన్ కార్డు కలిగి ఉండాలి. ఇంతటి కీలకమైన కార్డుల మంజూరును గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. దరఖాస్తు చేసుకున్న పేదలు నెలలు, ఏళ్ల తరబడి నిరీక్షించినా నిరాశే మిగిలింది. మార్పులు, చేర్పులకు కూడా అవకాశం కల్పించకపోవడంతో వేలాది మంది లబ్ధిదారులు సంక్షేమ పథకాలకు దూరమయ్యారు. ఈ తప్పిదాన్ని సరిచేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కొత్త కార్డుల మంజూరుతోపాటు ఉన్న వాటి సవరణకు అవకాశం కల్పిస్తూ డిసెంబరు 2 నుంచి 28వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణకు కూటమి ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. రాష్ట్రవ్యాప్తంగా ఆరోజు కొత్త రేషన్ కార్డుల దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియకు శ్రీకారం చేస్తున్నట్టు సివిల్ సప్లయిస్ అధికారులు చెబుతున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో 867 చౌక దుకాణాలు ఉన్నాయి. వీటిలో తెల్లరేషన్ (బియ్యం)కార్డులు 5,54,360 ఉన్నాయి. అలాగే ఏఏవై (అంత్యోదయ అన్న యోజన) 20,547 కార్డులు ఉన్నాయి.

ఉన్నవి తొలగించారు...

అధికారంలోకి 2019లో వచ్చిన వైసీపీ ప్రభుత్వం అప్పటికే ఉన్న పాత కార్డులను కాదని, నాటి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చిత్రాలు, ఆ పార్టీ రంగులతో ముద్రించిన రేషన్ కార్డులను అందజేశారు. ఇందుకోసం ప్రజాధనం వృథా చేయడంతో పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తాయి. కొత్తకార్డులు కావాల్సినవారు దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి అయిదు రోజుల్లో మంజూరు చేస్తామంటూ గొప్పలు చెప్పుకొచ్చారు. కొత్తవి ఇవ్వకపోగా ఆరంచెల విధానంలో వడపోసి అప్పటికే ఉన్న కార్డులు తొలగించారు. ఇది చాలదన్నట్టు కుటుంబ సభ్యుల్లో ఎవరికైనా వివాహం జరిగితే, విభజన చేసుకునేందుకు అనుమతివ్వలేదు. పేర్లు తొలగింపు, చేర్పులకు అవకాశం ఇవ్వలేదు. దీంతో అప్పటివరకు ప్రభుత్వం సంక్షేమ రాయితీ పథకాలు పొందుతున్న వారంతా వాటికి దూరమైపోయారు. అంతేకాకుండా చంద్రన్న సంక్రాంతి కానుకలు, క్రిస్మస్, రంజాన్ తోఫా కానుకలను పూర్తిగా నిలిపివేశారు.

అర్హులందరికీ అవకాశం..

కూటమి ప్రభుత్వం నిర్ణయంతో బియ్యం కార్డుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. లబ్ధిదారుల అవస్థలు గుర్తించిన కూటమి ప్రభుత్వం రేషన్‌కార్డుల సమస్యల పరిష్కారం దిశగా కార్యాచరణ రూపొందించింది. కొత్తగా కార్డులు, మార్పులు, చేర్పుల కోసం వచ్చే నెల 2 నుంచి 28 వరకు గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తులు స్వీకరిస్తోంది. అర్హులను గుర్తించి సంక్రాంతి పండగ కానుకగా ఇవ్వాలని సంకల్పించింది. ఈ నిర్ణయంతో వేలాదిమంది పేద, మధ్య తరగతి కుటుంబాల్లో ఆశలు చిగురించాయి. ఇప్పటికే గత ముఖ్యమంత్రి చిత్రం, వైసీపీ రంగులతో ముద్రించిన పంచదార, కందిపప్పు ప్యాకింగ్‌ను మార్చారు. కార్డుల రంగులను కూడా మార్చి కొత్తవి అందజేయనున్నారు.

తెల్లకార్డులు మంజూరు చేయాలి..

ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణిస్తున్న అంగన్‌వాడీ, ఆశా, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న చిన్నపాటి ప్రభుత్వ ఉద్యోగులకు కూడా కూటమి ప్రభుత్వం తెల్లరేషన్ కార్డులకు వెసులుబాటు కల్పించాలని ఆయా శాఖలకు చెందిన ఉద్యోగులు ఎంతోకాలంగా వేడుకుంటున్నారు. చాలీచాలని జీతాలతో ప్రభుత్వ ఉద్యోగంలో కొనసాగుతున్న తాము ఆర్థిక సమస్యలతో సతమతం అవుతున్నామని, ముఖ్యంగా తమ పిల్లల చదువుల విషయంలో అమ్మఒడి, ఫీజురీయింబర్స్‌మెంట్ వంటి పథకాలు వర్తించక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని కూటమి ప్రభుత్వం తమ కుటుంబాలకు తెల్ల రేషన్ కార్డులు కేటాయించేలా పునఃపరిశీలించాలని సంబంధిత ఉద్యోగులు కోరుతున్నారు.



సమిశ్రగూడెం గద్దర్ బ్రిడ్జి వద్ద నిలిచిపోయిన వాహనాలు

ట్రాఫిక్ జామ్

- సమిశ్రగూడెం గద్దర్ బ్రిడ్జి వద్ద సుమారు గంటన్నరకు పైగా నిలిచిపోయిన వాహనాలు
- ప్రయాణికుల ఇబ్బందులు

నిడదవోలు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సమిశ్రగూడెం గద్దర్ బ్రిడ్జి వద్ద శుక్రవారం సాయంత్రం సుమారు గంటన్నరకు పైగా ఏర్పడిన ట్రాఫిక్‌జామ్‌తో ప్రయాణికులు నానా ఇబ్బందులు పడ్డారు. సాయంకాలం సమయంలో పాఠశాలలు, కళాశాలలు వదలడం, మరోపక్క ట్రాఫిక్‌ను నియంత్రించాల్సిన పోలీసులు లేకపోవడం, ఎవరికి వారే ముందు వెళ్లిపోవాలి అనుకోవడంతో ట్రాఫిక్‌జామ్ ఏర్పడింది. సమిశ్రగూడెం బ్రిడ్జి వద్ద సాయంకాలం సమయాల్లో పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేసి ట్రాఫిక్‌జామ్ ఏర్పడకుండా చేయాలని పలువురు కోరుతున్నారు.

జనవరి 18 నుంచి సాధు పరిషత్ మహాసభలు



సమావేశంలో మాట్లాడుతున్న పరావిద్యానందగిరి స్వామిని

దేవరపల్లి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): అఖిలాంధ్ర సాధుపరిషత్ 60వ మహాసభలు జనవరి 18నుంచి 21వ తేదీ వరకు దేవరపల్లిలో నిర్వహించనున్నట్టు సాధు పరిషత్ అధ్యక్షురాలు పరా విద్యానందగిరి స్వామిని అన్నారు. దేవరపల్లిలో కరుటూరి ఫంక్షన్‌హాలులో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ అఖిలాంధ్ర సాధుపరిషత్ 1965లో ఏర్పాటైందని ఇప్పటి వరకు దేశంలోని వివిధ ప్రాంతాల్లో 59 మహాసభలు నిర్వహించామని, 60వ సభ దేవరపల్లిలో నిర్వహిస్తున్నామన్నారు. ప్రజల్లో ఆధ్యాత్మికత, సంస్కృతి, సంప్రదాయాలు, ప్రేమానురాగాలు, భక్తిధోరణి, మానవత విలువలు పెంపొందించడం ఈ సభల ముఖ్య ఉద్దేశమన్నారు. దేశంలోని వివిధ పీఠాధిపతులు, సాధుపుంగవులు ఆధ్యాత్మిక ప్రసంగాలు చేస్తారన్నారు. మూడేళ్లకోసారి జరిగే పరిషత్ నూతన కార్యవర్గం ఏర్పాటు జనవరిలో దేవరపల్లిలో జరుగుతుందన్నారు. ఈ సభలకు దేశంలోని 300మంది వివిధ ప్రాంతాల నుంచి సాధువులు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో సాధుపరిషత్ ఉపాధ్యక్షుడు పరమాత్మ ఆనందగిరి స్వామి, జగదీశ్వరనందగిరి స్వామి, సూర్య భాస్కర్ స్వామి, సరస్వతి స్వామి, శ్రీకృష్ణానంద బ్రహ్మచారి, త్యాగదయానందగిరిస్వామి, బాలాజీ స్వామి, స్థానికులు పాల్గొన్నారు.

డిసెంబర్ 7న మెగా పేరెంట్స్ డే



సమావేశంలో పాల్గొన్న ప్రధానోపాధ్యాయులు

గోపాలపురం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): పాఠశాల వ్యవస్థకే అతిపెద్ద పండుగగా మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాన్ని డిసెంబర్ 7న నిర్వహించాలని మండల విద్యాశాఖాధికారి జీ.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యావ్యవస్థను బలోపేతం చేయ డంతో పాటు విద్యార్థి వికాసానికి, సమస్యల పరిష్కారానికి మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశం వేదికగా నిలుస్తుందన్నారు. అటు విద్యార్థులు, ఇటు ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల మధ్య స్నేహపూర్వక వాతావరణాన్ని నెలకొల్పడం కోసం ఈ సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తామని ఎంఈవో చెప్పారు. కార్యక్రమంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

డిసెంబరు 8న తాళ్లపూడిలో..

తాళ్లపూడి. నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 8న మెగా పేరెంట్స్‌డే జరుగనుందని, సమావేశం నిర్వహణపై రాష్ట్ర స్థాయి వీడియో కాన్ఫరెన్స్‌లో భాగంగా శుక్రవారం ఎంఈవో బాలామణి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. దీనిలో మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు అవగాహన పొంది కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని కోరారు. అనంతరం ఆరోజు నిర్వహించవలసిన కార్యక్రమాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎంఈవో-2 నెహ్రాజీ మాట్లాడుతూ కార్యక్రమం నిర్వహణపై ఎటువంటి సందేహాలున్నా ఎంఈవోలను అడిగి సమావేశాన్ని నిర్వహించాలని చెప్పారు

విజయవంతంగా ఇంటింటి ఆరోగ్య పరీక్షలు

డిప్యూటీ డీఎంఅండ్ హెచ్‌వో డాక్టర్ సంధ్య



వైద్య ఉద్యోగులతో మాట్లాడుతున్న డాక్టర్ వసంతలక్ష్మి

నల్లజర్ల, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఇంటింటి ఆరోగ్య పరీక్షలు విజయవంతంగా జరుగుతున్నాయని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ సంధ్య, డీసీహెచ్ఎస్‌వో వసంతలక్ష్మి అన్నారు. శుక్రవారం మండలంలోని జగన్నాథపురం, నల్లజర్ల గ్రామాల్లో వారు పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం తాజాగా చేపట్టిన ఎన్‌సీడీ 3.0 కార్యక్రమంలో భాగంగా ప్రజలకు షుగర్, బీపీ, హిమోగ్లోబిన్, క్యాన్సర్ వంటి వ్యాధులకు వైద్య పరీక్షలు చేస్తున్నామన్నారు. ప్రజలకు ఆరోగ్యంపై అవగాహనతోపాటు ఇంటింటి సర్వే చేసి ప్రతి ఇంటిలో ఏ వ్యాధులు ఉన్నాయో గుర్తించి వాటి నివారణకు తగిన ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నామన్నారు. 18 ఏళ్లు దాటిన ప్రతిఒక్కరికి ఆరోగ్య పరీక్షలు చేసి వ్యాధుల నిర్ధారణ చేసి వాటిని ఆన్‌లైన్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ తెల్లం గంగాధర్, డాక్టర్ మహ్మద్ సిరాజుద్దీన్, జీవీవీ ప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాణం తీసిన ఈత సరదా

చెరువులో మునిగి విద్యార్థి మృతి.. నల్లజర్లలో విషాదం



జ్యోతిప్రకాష్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబీకులు

నల్లజర్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి ఈత సరదా ప్రాణం తీసింది. స్థానికుల వివరాల ప్రకారం.. నల్లజర్లకు చెందిన గుడిసే మణికంఠ కుమారుడు జ్యోతిప్రకాష్(15) స్థానిక జడ్పీ హైస్కూల్లో 9వ తరగతి చదువుతున్నాడు. తన స్నేహితులైన జంపెల్లి రాజేశ్(10వ తరగతి), ములపర్తి హేమంత్‌కుమార్(7వ తరగతి), తాడి యువరాజ్(9వ తరగతి)లతో కలిసి శుక్రవారం స్కూల్ మానివేసి హెచ్‌పీ గ్యాస్ గోడౌన్స్ వద్ద ఉన్న పేరంటాల గుంట చెరువులో సరదగా ఈత కొట్టడానికి వెళ్లారు. స్నానం చేస్తుండగా ప్రకాశ్ ఊబిలో దిగిపోవడంతో స్నేహితులు లాగే ప్రయత్నం చేశారు. అయినా ప్రయోజనం లేకపోవడంతో అక్కడకు చేరుకున్న స్థానికులు బయటకు తీసుకుని వచ్చి గ్రామంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే ప్రకాశ్ మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. ఇంటి నుంచి స్కూల్‌కి వెళుతున్నానని చెప్పి విగతజీవిగా వచ్చిన కుమారుడు మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు.వారి రోదనలు మిన్నంటాయి.

డిసెంబరు 10న చలో విజయవాడ



పోస్టరు ఆవిష్కరిస్తున్న వివిధ సంఘాల నాయకులు

తాళ్లపూడి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) డిసెంబరు 10వ తేదీన జరిగే చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిస్తూ ఏపీజేఏసీ, ఫ్యాప్టో, ఏపీ ఎన్‌జీవోల సంఘ నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం తాళ్లపూడి మండల పరిషత్ కార్యాలయం వద్ద పోస్టరును విడుదల చేశారు. ఏపీజేఏసీ జిల్లా అధ్యక్షుడు జోడాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ చలో విజయవాడ కార్యక్రమానికి మద్దతుగా ఉద్యోగ ఉపాధ్యాయులు, కార్మిక పెన్షనర్లు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాలు ఎక్కువ జరగాలి



పాలచర్ల పీహెచ్‌సీలో సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

పాలచర్ల పీహెచ్‌సీ తనిఖీలో డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు

దివాన్‌చెరువు, నవంబరు29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాలు ఎక్కువగా జరిగేలా చూడాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు సూచించారు. రాజానగరం మండలం పాలచర్లలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. హెచ్ఎంఐఎస్, ఈహెచ్ఆర్ తదితర రికార్డులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఆసుపత్రిలో అవుట్‌పేషెంట్లతో బాటు ఐపీ సంఖ్య కుడా పెరగవలసి ఉందని చెప్పారు. ఆయా గ్రామ సచివాలయాల జనాభాకు తగ్గట్టుగా ఐయూడీలు ఉండాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్లు బెనడిక్ట్, శ్రీరాణి, డీఎంహెచ్‌వో కార్యాలయ డాక్టర్లు షమ్మీకుమార్, నిశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నియంత్రణపై విస్తృత అవగాహన

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ వ్యాధి నియంత్రణపై ప్రజల్లో విస్తృతమైన అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం రాజమహేంద్రవరంలోని గోకవరం బస్టాండు ఆవరణలో వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఐఈసీ మెటీరియల్‌తో కూడిన అవగాహన స్టాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి నియంత్రణ లక్ష్యంగా వైద్య, ఆరోగ్యశాఖ ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ వసుంధర మాట్లాడారు. జిల్లా న్యూక్లియస్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మానస, నారీ సాక్ష్యం, వైఆర్‌జీ కేర్ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలకు నాంది తిరుపతి ఐఐటీ

- తిరుపతి ఐఐటీ టెక్నాలజీ ఇంక్యూబేషన్ హబ్ ప్రాజెక్టు డైరెక్టర్ రోషన్ శ్రీవాత్సవ్
- జీజీయూలో ఐడీఈ బూట్ క్యాంప్



కార్యక్రమానికి హాజరైన ప్రముఖులు, పాఠశాలల ఉపాధ్యాయులు

రాజానగరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): తిరుపతి ఐఐటీ గ్రామీణ విద్యార్థులకు సృజనాత్మకతతో కొత్త ఆవిష్కరణలకు అవసరమైన నైపుణ్యాభివృద్ధికి తోడ్పాటు అందిస్తోందని తిరుపతి ఐఐటీలోని టెక్నాలజీ ఇంక్యూబేషన్ హబ్ ప్రాజెక్టు డైరెక్టర్ రోషన్ శ్రీవాత్సవ్ అన్నారు. గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ)లోని ఐసీటీ సౌజన్యంతో ఇన్నోవేషన్ డిజైన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ (ఐడీఈ)బూట్ క్యాంప్ శుక్రవారం ప్రారంభమైంది. జీజీయూ కులపతి కేవీవీ సత్యనారాయణరాజు(చైతన్యరాజు)అధ్యక్షతన జరిగిన ప్రారంభోత్సవ సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన శ్రీవాత్సవ్ మాట్లాడుతూ జీజీయూ అనుసంధానంతో విద్య జీఐఎస్ కార్యక్రమాన్ని త్వరలో ప్రారంభించేందుకు చేయూతనిస్తామన్నారు. మరో అతిథి ఐపీ అండ్ టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ ఇన్నోవేషన్ సెల్(ఏఐసీటీఈ) మేనేజర్ ఐఎన్ భీమలింగారెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో బాల్య దశ నుంచి సృజనాత్మకతను పెంపొందించే దిశగా పాఠశాల ఉపాధ్యాయులకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు రెండు దశల్లో శిక్షణ జరిపామని, ప్రస్తుతం మూడో దశ శిక్షణా కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. వాద్వానీ ఫౌండేషన్ ప్రతినిధి విశాల్‌నాయర్ మాట్లాడుతూ దేశంలోని మారుమూల ప్రాంతాల్లో విద్యార్థులకు ఉపాధ్యాయుల ద్వారా శిక్షణ అందించడం తమ ఫౌండేషన్ ముఖ్యోద్దేశ్యమన్నారు. బూట్ క్యాంప్ నోడల్ అధికారి టి.జ యానందకుమార్ మాట్లాడుతూ రెండు రోజుల పాటు జరిగే ఈ శిక్షణ కార్యక్రమానికి తెలుగు రాష్ట్రాలతో పాటుగా మహారాష్ట్ర, చత్తీస్‌ఘడ్, ఒరిస్సా, తమిళనాడు రాష్ట్రాల నుంచి 271 మంది ఉపాధ్యాయులు హాజరైనట్టు చెప్పారు. కార్యక్రమంలో జీజీయూ వీసీ యు.చంద్రశేఖర్, డైరెక్టర్ శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ పీఎంఎంఎస్ శర్మ, దండమూడి విజేంద్రకుమార్, కె.వినోద్‌వర్మ, పలు విభాగాల అధిపతులు, డీన్లు పాల్గొన్నారు.

నేడు కొవ్వూరు కౌన్సిల్ సమావేశం: కమిషనర్

కొవ్వూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ఈ నెల 30వ తేదీ ఉదయం 11గంటలకు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ టి.నాగేంద్రకుమార్ తెలిపారు. పట్టణంలోని వివిధ వార్డుల్లో చేపట్టనున్న అభివృద్ధి పథకాలపై మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి అధ్యక్షతన చర్చించనున్నట్టు చెప్పారు. ఈ సమావేశానికి కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు.

బంగారుపాపమ్మ ఉత్సవాలు



తాళ్లపూడి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) మండలంలోని అన్నదేవరపేట గ్రామంలో వేంచేసియున్న గ్రామ దేవత బంగారుపాపమ్మ తల్లి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. గ్రామానికి విచ్చేసిన ఆడపడుచులతో, బంధువులతో గ్రామం సందడిగా మారింది. ఆలయ ప్రాంగణమంతా విద్యుద్దీపాలంకరణ చేశారు. ఇంజరపు అబ్బులు, తొండెపు రమేష్ ఆధ్వర్యంలో ఉత్సవ ఏర్పాట్లు చేశారు. దూరప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వస్తున్నారు. ఉత్సవాలు ఈ నెల 30వ తేదీ వరకూ నిర్వహిస్తామని కమిటీ నిర్వాహకులు తెలిపారు.

ప్రభుత్వ సలహాదారుడు షరీఫ్‌ను కలిసిన సుభాన్



రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడిగా బాధ్యతలు స్వీకరించిన జనాబ్ ఎంఏ షరీఫ్‌ను ఏపీ టీడీపీ నూర్ బాషా సాధికార సమితి కన్వీనర్ షేక్ సుభాన్ మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ మేరకు రాజమహేంద్రవరంలో శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. షరీఫ్‌ను కలిసిన వారిలో ఆయుర్వేద వైద్యుడు జమాల్ ఖాన్, టీడీపీ నాయకులు సల్మాన్, మౌలానా.ఇబ్రహీం తదితరులున్నారు.

విమానాశ్రయ విస్తరణ పనుల్లో పురోగతి

కలెక్టర్ ప్రశాంతి, ఎయిర్‌పోర్టు అథారిటీ డైరెక్టర్ జ్ఞానేశ్వర్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ప్రశాంతి, డైరెక్టర్ జ్ఞానేశ్వర్

కోరుకొండ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మధురపూడి విమానాశ్రయ విస్తరణ పనులు షెడ్యూలుకు అనుగుణంగా పురోగతిలో ఉన్నాయని కలెక్టర్ పి.ప్రశాంతి, ఎయిర్‌పోర్టు అథారిటీ డైరెక్టర్ ఎస్.జ్ఞానేశ్వర్ పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం నైపుణ్యాభివృద్ధి, ఇన్‌ఫ్రా డెవలప్‌మెంట్ శాఖల ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్ అమరావతి నుంచి విమానాశ్రయ పనులపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ భూ సేకరణకు చెందిన మ్యుటేషన్ పూర్తికాగా ఐదెకరాలకు సంబంధించిన పనులు ఈ వారంలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. రెండు కోర్టు కేసులు పెండింగులో ఉన్నాయన్నారు. వ్యవసాయ క్షేత్రాలకు అనుసంధానం, రహదారి మార్గం కూడా పరిష్కరించాల్సి ఉందన్నారు. ఆర్థికపరమైన అంశాల నేపథ్యంలో వాటి పరిష్కారం దిశగా అడుగులు వేస్తున్నామని కలెక్టర్ చెప్పారు. ఎయిర్‌పోర్టు అథారిటీ డైరెక్టర్ ఎస్.జ్ఞానేశ్వర్, డీజీఎం శ్రీనివాసులు పనుల పురోగతిపై వివరాలు తెలిపారు. రూ.173.28 కోట్లతో చేపట్టనున్న పనుల్లో ఆర్‌బీసీ పనులు 99శాతం పూర్తయ్యా యని, మాన్సన్ పనులు 25శాతం, మాట్రికేషన్ పనులు 20 శాతం పూర్తి చేశామన్నారు. 2025 ఆగస్టు 11 నాటికి పనులన్నీ పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

నాయీబ్రాహ్మణులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి

కార్తీక వనసమారాధనలో జనసేన గోపాలపురం ఇన్‌చార్జి సువర్ణరాజు



కార్యక్రమంలో మాట్లాడుతున్న సువర్ణరాజు

దేవరపల్లి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): నాయీబ్రాహ్మణులు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి సువర్ణరాజు అన్నారు. దేవరపల్లిలో శుక్రవారం జరిగిన నాయీబ్రాహ్మణుల కార్తీక వన సమారాధనకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. నాయీబ్రాహ్మణులు తమ వృత్తితో పాటు తమ పిల్లలను ఉన్నత విద్యనభ్యసించేలా ప్రోత్సహించాలన్నారు. సంఘానికి ఎల్లప్పుడు సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో గన్నమని హరికృష్ణ, బళ్లా సూర్యచక్రం, ఉప్పులూరి రాంబాబు, పేరం రవీంద్రనాథ్, జాజిమొగ్గల శ్రీనివాస్, కడియం సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడు హిందూ బంధువుల వనసమారాధన

కొవ్వూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు సంస్కృత పాఠశాల ప్రాంగణంలో శనివారం హిందూ బంధువుల కార్తీక వనసమారాధన నిర్వహిస్తున్నట్టు నిర్వాహకుడు గండ్రోతు పవన్ సోమరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం ఆలయార్చకులు, ఆగమన పండితులు పలు పూజా కార్యక్రమాలు జరిపిస్తారని, ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు కలశ స్థాపన, మాజీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు గోపూజ, మాజీ మున్సిపల్ చైర్మన్ దంపతులు లక్ష్మీనారాయణ పూజ నిర్వహిస్తారని చెప్పారు. మధ్యాహ్నం అన్నసమారాధన, రాత్రి వేద పండితులకు సత్కారం, దీపార్చన జరుగుతాయని సోమరాజు పేర్కొన్నారు.

తులసి ధాత్రి శ్రీలక్ష్మీనారాయణ కుంకుమ పూజలు



ధాత్రి శ్రీలక్ష్మీనారాయణ కుంకుమ పూజలు చేస్తున్న దృశ్యం

చాగల్లు, నవరంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి మైదానంలో శుక్రవారం కార్తీక మాస శివరాత్రి సందర్భంగా తులసి ధాత్రి శ్రీలక్ష్మీనారాయణ కుంకుమ పూజలు నిర్వహించారు. వేదపండితులు గోవిందవర్జుల సుబ్రహ్మణ్య శర్మ వేద పండితుల మంత్రోచ్ఛరణతో పార్థివ లింగేశ్వరునికి విశేష పూజలు జరిగాయి. గ్రామ సుభిక్షం, ప్రజల ఆయురారోగ్యాలతో జీవించాలని కోరుతూ స్వామికి ఏకాదశ రుద్రాభిషేకం, గణపతి పూజ, బిల్వార్చాన, గోపూజ తులసిధాత్రి కుంకుమ పూజ నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

నేడు పింఛన్ల పంపిణీ

గోపాలపురం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం పింఛన్ల పంపిణీకి సర్వం సిద్ధం చేసినట్టు ఇన్‌చార్జి ఎంపీడీవో బీఎస్ఎస్ శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలో 9063 మంది లబ్ధిదారులకు సామాజిక భద్రతా పింఛన్లలో భాగంగా రూ.3,84,17,000 పంపిణీ చేయాల్సి ఉందన్నారు. పింఛన్ల పంపిణీ కోసం 203 మంది సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు.

9319 మంది పింఛను లబ్ధిదారులు

చాగల్లు, నవరంబరు 29 (ఆంధ్రజ్యోతి): సామాజిక భద్రత ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్‌లు పంపిణీ ఒక రోజు ముందుగా శనివారం పంపిణీ చేయనున్నట్టు ఎంపీడీవో ఆర్.శ్రీదేవి తెలిపారు. శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఆమె మాట్లాడుతూ మండలంలోని 13 గ్రామాల పరిధిలోని 18 గ్రామ సచివాలయాల్లో 9319 మంది లబ్ధిదారులకు రూ.3,96,58,000 విడుదల చేసినట్టు చెప్పారు. 142 మంది సిబ్బందితో పెన్షన్‌లు పంపిణీకి ఏర్పాట్లు చేశామని, ఉదయం 5.30నిమిషాల నుంచి పెన్షన్‌లు పంపిణీ ప్రారంభమవుతుందని ఎంపీడీవో చెప్పారు.

సోమేశ్వరుడికి అభిషేకాలు



సోమేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

నిడదవోలు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): నిడదవోలులో బాలా త్రిపుర సుందరి సమేత సోమేశ్వరస్వామి పంచాయతన క్షేత్రం శుక్రవారం స్వామి నామస్మరణతో మారుమ్రోగింది. స్వామికి ప్రీతిపాత్రమైన కార్తీక మాసం ఒక పక్క మరో పక్క మాసశివరాత్రి కావడంతో తెల్లవారుజాము నుంచే సోమేశ్వరస్వామికి విశేష అభిషేకాలు బాలాత్రిపుర సుందరి అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీకాకుళపు లక్ష్మీ నరసింహశాస్త్రి ఆధ్వర్యంలో వేద పండితులు విశేష అభిషేకాలు నిర్వహించారు. సాయంకాలం మహిళలు పెద్ద ఎత్తున కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



దేవరపల్లి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): దేవరపల్లి శివారు గోపాలపురం రహదారి పక్కన గుర్తుతెలియని వ్యక్తి(50) మృతి చెందినట్టు ఎస్ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ నెల 26న దేవరపల్లి ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యం పొందినట్టు ఆసుపత్రి ఓపీకార్డు పైన జే.లక్ష్మణరెడ్డి అనే పేరు మాత్రమే ఉందని ఆచూకీ తెలిసిన వారు 94407 96624, 91948 75590 నెంబర్లన సంప్రదించాలని ఎస్ఐ చెప్పారు.

వన సంరక్షణకు ప్రతీఒక్కరు మొక్కలు నాటాలి

అనపర్తి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వన సంరక్షణ కోసం ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని అనపర్తి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఇన్‌చార్జి న్యాయమూర్తి రెడ్డి ప్రసన్న అన్నారు. శుక్రవారం కార్తీక మాసం సందర్భంగా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టు ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమంలో ఆమె పాల్గొని ఉసిరి మొక్కను నాటారు. ఈ సందరభంగా మాట్లాడుతూ కార్తీక మాసం అనేక విశిష్టతలను తెలుపుతుందని ముఖ్యంగా వన సరంక్షణ కోసం ఏర్పడిన మాసమని అన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు, బార్ అసోసియేషన్ ప్రతినిధులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని అగ్రభాగాన నిలిపేది సీఎం చంద్రబాబే

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జగన్ అవగాహన లేని పాలనతో రాష్ట్రం భ్రష్టుపట్టిపోయిందని, ఇప్పుడు వ్యూహాత్మకంగా సీఎం చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం ఏపీని అగ్రభాగాన నిలబెట్టేందుకు కృషి చేస్తోందని మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు శనివారం ఓ ప్రకటనలో అన్నారు. చేసిందంతా చేసి ఇప్పుడు జగన్ సన్మానాలు కోరడం విడ్డూరంగా ఉందన్నారు.